సోమవారం
20-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 328
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వియత్నాం కొత్త అధ్యక్షుడిగా టోలమ్!

హనోయ్: వియత్నాం నూతన అధ్యక్షుడిగా ప్రజా భద్రతాధికారి టో లమ్ నామినేట్ అయ్యారు.
ఈనెల 21న జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో అధ్యక్షుడిగా టో లమ్ నామినేషన్‌కు ఆమోదం లభించబోతోంది. టో లమ్ నాలుగు దశాబ్దాలు ప్రజా భద్రతా మంత్రిత్వశాఖలో పనిచేశారు. 2016లో మంత్రి అయ్యారు.
అవినీతి వ్యతిరేకంగా చర్యల అమలులో కీలక పాత్రధారుడిగా ఉన్నారు. అధ్యక్షుడు వో వాన్ థోంగ్ రాజీనామా వియత్నాంలో రాజకీయ అస్థిరతకు దారితీసింది. దీంతో టో లమ్ నామినేషన్‌కు కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కూడా అంగీకరించింది.

నేడు ఐదో విడత పోలింగ్

- 8 రాష్ట్రాలు/యూటీల్లోని 49 సీట్లలో ఎన్నికలు
- బరిలో రాహుల్, రాజ్‌నాథ్, స్మృతి ఇరానీ

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ఐదవ దశ ఓటింగ్ మే 20వ తేదీ సోమవారం ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో జరగనుంది. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ఐదో దశలో ఉత్తరప్రదేశ్‌లోని 14 స్థానాలకు, మహారాష్ట్రలో 13, పశ్చిమ బెంగాల్‌లో 7, బీహార్‌లో 5, ఒడిశాలో 5, జార్ఖండ్‌లో 3, జమ్మూకశ్మీర్, లడాఖ్‌లో ఒక్కొక్క స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశ పోలింగ్‌లో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. రాయ్‌బరేలీ స్థానం నుంచి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతో పాటు కీలక అభ్యర్థుల్లో మరికొందరు ఉన్నారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అమేథీ నుంచి పోటీ చేస్తున్నారు. లక్నో నుంచి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కైసర్‌గంజ్ నుంచి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ కుమార్తె రోహిణి ఆచార్య సరన్ నుంచి, చిరాగ్ పాశ్వాన్ హాజీపూర్ నుంచి, ముంబై ఉత్తర నియోజకవర్గం నుంచి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, బారాముల్లా నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో

- మిగతా 2 లో

ఆప్ నిరసన... ఉద్రిక్తం

- దిల్లీలో బీజేపీ కార్యాలయ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు... అరెస్టులు
- ఆప్ అంతానికి 'ఆపరేషన్ ఝాడు': కేజ్రీవాల్

న్యూదిల్లీ: దిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అధికారంలోఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీని చూసి బెంబేలెత్తుతున్న కాషాయపార్టీ...లోక్‌సభ ఎన్నికల వేళ ఎలాగైనా ఆ పార్టీని రాజకీయంగా ప్రజల్లో పలచన చేయడానికి కుట్రలు చేస్తున్నది. ఆప్ ఎంపీ మలివాల్‌పై దాడి కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు విభవ్‌కుమార్ అరెస్ట్ కావడం దేశ రాజధానిలో ప్రకంపనలు రేపింది. బీజేపీ బరి తెగింపుతో తీవ్ర ఆగ్రహానికి గురైన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్... 'బీజేపీ ఆఫీసుకు వస్తున్నా... ఎంతమందిని జైల్లో వేస్తారో వేయండి' అంటూ ప్రధాని మోదీకి సవాల్ విసరడం... అన్నట్లుగానే ఆదివారం పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు, నాయకులతో కలిసి దిల్లీలోని బీజేపీ కార్యాలయ ముట్టడికి బయలుదేరడంతో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ఎదుట తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు యత్నించిన కేజ్రీవాల్, ఆప్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కేజ్రీవాల్, ఇతర నేతలు ఆప్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఆప్

- మిగతా 2 లో

ఐదు రోజుల కస్టడీకి విభవ్ కుమార్

న్యూదిల్లీ: ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు విభవ్ కుమార్‌కు దిల్లీలోని హజారీ కోర్టు ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. తనపై దాడి చేశారని మలివాల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విభవ్ కుమార్‌ను దిల్లీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఏడు

- మిగతా 2 లో

నివేదిక సిద్ధం

అల్లర్ల ఘటనలపై సిట్ దర్యాప్తు పూర్తి

- భద్రతా వైఫల్యాలే కారణం!
- పోలీసుస్టేషన్లకు వెళ్లి ఎఫ్ఐఆర్‌ల పరిశీలన
- విచారణా బృందాన్ని కలిసిన మంత్రి అంబటి
- నేడు ఈసీకి నివేదిక : సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్ర ప్రదేశ్‌లో సిట్ అధికారుల దర్యాప్తు దాదాపు పూర్తయింది. సార్వత్రిక ఎన్నికల రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలపై 13 మంది అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఈసీ నియమించింది. సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ అధ్వర్యంలో అధికారులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాలకు సిట్ అధికారులు వెళ్లి విచారణ నిర్వహించారు. పల్నాడు, తిరుపతి జిల్లాల్లో దర్యాప్తు దాదాపు పూర్తయింది. మిగిలిన జిల్లాల అల్లర్లపైనా దృష్టి పెట్టారు. తుది నివేదికను ఈసీకి అందజేసేందుకు సిద్ధమయ్యారు. పల్నాడు జిల్లాలో అదనపు ఎస్పీ నేతృత్వాన సిట్ అధికారుల దర్యాప్తు రెండో రోజూ కొనసాగింది. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సిట్ అధికారులు వెళ్లి అల్లర్ల సమయంలో వీడియోలను పరిశీలించారు. కారంపూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ జరిగిన ఘర్షణలపై

- మిగతా 2 లో

అధికార మార్పు తప్పదు

- బీజేపీ, వైసీపీకి ఓటమే
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర–గుంటూరు: అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో అధికార మార్పిడి తథ్యమని, ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎలా ఉన్నా... ఎన్నికల తరువాత అసలు ఇంజన్ ఉంటుందో లేదోనని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికలలో ప్రధాని మోదీ ఉపన్యాసాల సరళి పరిశీలిస్తే అది అర్థమవుతుందన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పూర్తిగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని విమర్శించారు. అయోధ్య రామమందిరంతో ప్రారంభమైన వారి ప్రచారం మోదీ గ్యారెంటీ, మంగళసూత్రాలు లాగేసుకుంటారనే వరకు వచ్చిందన్నారు. ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ ముస్లిం వ్యతిరేక ప్రచారం ద్వారా హిందువుల ఓట్లు పొందాలని చూశారని విమర్శించారు. ఎన్నికల్లో 400

- మిగతా 2 లో

కట్టలు తెంచుకున్న అభిమానం

- బారికేడ్లు దాటుకొని వేదిక వద్దకు జనం
- అదుపు చేయడంలో పోలీసుల వైఫల్యం
- ప్రసంగించకుండా వెనుతిరిగిన రాహుల్, అఖిలేశ్

న్యూదిల్లీ: ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆదివారం ఉత్తరప్రదేశ్ ర్యాలీలో ఉద్ఘాటించారు. బీజేపీకి వ్యతిరేకంగా రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు జరుగుతున్న తమ ఐక్య పోరాటంలో గెలుపు తమదేనన్న దీమా వ్యక్తం చేశారు. అయితే కట్టలు తెంచుకున్న అభిమానంతో ఇబ్బంది పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, ముంగేరీలో ప్రచారానికి వెళ్లిన ఇద్దరు నేతలకు ప్రసంగించే అవకాశం లభించలేదు. ర్యాలీల్లో, సభల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో జనం రావడం, వారిని అదుపు చేయడంలో పోలీసులు విఫలం కావడంతో ప్రసంగించకుండానే ఇద్దరు నేతలు వెనక్కు వెళ్లాల్సి వచ్చింది. ఫుల్‌పూర్ పార్లమెంటు నియోజకవర్గంలోని పడిలాలో నిర్వహించిన సభకు అభిమానులు పోటెత్తారు. దీంతో నేతలు మాట్లాడే అవకాశం రాలేదు. సంయమనం పాటించాలని రాహుల్, అఖిలేశ్

- మిగతా 2 లో

కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

- లభించని ఇబ్రహీం ఆచూకీ
- సహాయచర్యలకు అనుకూలించని వాతావరణం

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆదివారం ప్రమాదానికి గురైంది. వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ కుప్పకూలింది. ఆయన వెంట విదేశాంగ మంత్రి అమీర్ అబ్దుల్లాహియన్ కూడా ఉన్నారు. వాయువ్య ఇరాన్‌లోని జోల్ఫాలో ఈ దుర్ఘటన జరిగిందని ఇరాన్ మీడియా పేర్కొంది. 20

- మిగతా 2 లో

ఓటింగ్ రికార్డు స్థాయిలో జరగగా, బెట్టింగులూ అదే రీతిలో ఉన్నాయి. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాలపై కోట్లలో బెట్టింగ్ లావాదేవీలు నడుస్తున్నాయి. సంక్రాంతి పండుగ తరహాగా ఎన్నికల బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎక్కడికక్కడే బెట్టింగులు కడుతున్నారు.

భారీగా బెట్టింగులు!

- ఏపీపై రూ.15 వేల కోట్లు?
- మధ్యవర్తుల దగ్గర డబ్బు
- వైసీపీ, ఎన్డీఏ గెలుపుపై ధీమాలు
- చంద్రబాబు, పవన్ గెలుపోటములపై పందేలు
- జగన్ మెజార్టీ హెచ్చుతగ్గులపైనా...
- నియంత్రణలో ఈసీ వైఫల్యం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుంది. కాదు... ఎన్డీఏ కూటమిదే అధికారం. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్ ఓటమి పాలవుతారు. కాదు... భారీ మెజార్టీతో గెలుస్తారు. పులివెందులలో సీఎం జగన్ మెజార్టీ గతం కంటే పెరుగుతుంది. లేదు... తగ్గుతుంది' ఈ తరహా ఏపీలో ఎటు చూసినా భారీగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఐపీఎల్ మ్యాచ్ తరహా ఏపీలో లక్షలాది రూపాయల నుంచి కోట్ల వరకు బెట్టింగుల పర్వం ఊపందుకుంది. ఓటింగ్ రికార్డు స్థాయిలో జరగగా, బెట్టింగులూ అదే రీతిలో ఉన్నాయి. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాలపై కోట్లలో బెట్టింగ్ లావాదేవీలు నడుస్తున్నాయి. ఈ బెట్టింగ్‌లతో ఆంధ్రప్రదేశ్‌కు సంక్రాంతి ముందే వచ్చినట్లయింది. సంక్రాంతి పండుగ తరహాగా ఎన్నికల బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎక్కడికక్కడే బెట్టింగులు కడుతున్నారు. వీటి నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయన్న విమర్శలున్నాయి. చేతులు కాలాక సిట్‌లు వేసి తన ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

ఇప్పటికే ఎన్నికల సందర్భంగా చెలరేగిన అల్లర్లలో... ఈసీపై అనేక ఆరోపణలున్నాయి. ఎన్నికలకు రెండు, మూడు రోజులపాటు ఎన్డీఏ, వైసీపీ అభ్యర్థులు భారీగా డబ్బు, మద్యం పంపిణీ చేసినప్పటికీ ఈసీ చోద్యం చూసింది. ఏపీలో రూ.301.75 కోట్ల విలువైన డబ్బు, మద్యం, ఇతర

- మిగతా 2 లో

నికోబార్ దీవులకు నైరుతి

31కి కేరళకు రుతుపవనాలు

న్యూదిల్లీ: ఖరీఫ్ సీజన్లో రైతులకు శుభవార్త అందింది. లానినితో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల కారణంగా పసిఫిక్ సముద్రం చల్లబడటం వల్ల ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలోనే నైరుతి రుతుపవనాలు నికోబార్ దీవులకు చేరుకున్నాయని వెల్లడించింది. మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు ఆదివారం చేరుకున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. దీంతో ఈ నెల 31 నాటికి రుతుపవనాలు కేరళకు చేరుకునే అవకాశం ఉందన్నారు. గత 150 ఏళ్లలో కేరళలో రుతుపవనాల ఆగమన తేదీల్లో చాలా తేడాలు ఉన్నాయి. 1918లో రుతుపవనాలు మొదటగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!



అందరూ గెలుస్తారయ్యా...ఓటరుగా నువ్వొక్కడివే దారుణంగా ఓడిపోతావు.

పార్లమెంటు భద్రత కోసం 3300 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది

నేటి నుంచి విధులకు...

పార్లమెంటు సమగ్ర భద్రత బాధ్యతలు పూర్తిస్థాయిలో 'సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) నిర్వహించనుంది.

2లో

వాషింగ్టన్‌లో పలస్తీనా సంఘీభావ ర్యాలీ

పాల్గొన్న నాలుగు వందల మంది

వాషింగ్టన్: అమెరికాలో పలస్తీనా సంఘీభావ ర్యాలీ జరిగింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నాలుగు వందల మంది నేషనల్ మాల్‌కు కదం తొక్కారు. 'నక్బా'కు 76 ఏళ్లు అయిన సందర్భంగా పలస్తీనాకు మద్దతు ప్రకటించారు. ఇజ్రాయిల్, అమెరికా ప్రభుత్వాల యుద్ధ ధోరణిని వ్యతిరేకించారు.

గాజాలో యుద్ధానికి నిరసనగా నినాదాలిచ్చారు. పలస్తీనా గతంలో, వర్తమానంలో అనుభవించిన కష్టాలను గుర్తుచేసుకున్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణను దుయ్యబట్టారు. ఆక్రమిత భూమిలో శాంతి లేదని నినదించారు. 'తక్షణమే హత్యాకాండ ఆపాలి, పలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధ నేరాలను ఆపాలి' అన్న నినాదాలు కెపిటల్ భవన ఆవరణలో మార్మోగాయి. గాజాలో ప్రాణనష్టం భారీగా పెరగడానికి అధ్యక్షుడు జో బైడెన్ కూడా కారణమే అంటూ నిరసనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'బైడెన్, బైడెన్ నీ వారసత్వం మారణహోమం' అంటూ నినాదాలిచ్చారు.

'పలస్తీనియన్ల కోసం గళమెత్తే ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇటువంటి వాతావరణంలోనూ బయటకు వచ్చి మీ సందేశాన్ని ఇవ్వాలని కృషి చేసిన మీ అందరికీ ధన్యవాదాలు' అంటూ జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ సోఫోమోరే రీమ్ లబాబ్దీ అన్నారు. గతేడాది అక్టోబరు 7 నుంచి గాజాలో యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటివరకు 35వేల మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే.

కాంగోలో తిరుగుబాటుయత్నం

తిప్పికొట్టిన సైన్యం

కిన్షాసా: దేశంలో తిరుగుబాటుకు విఫల యత్నం జరిగిందని ది డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ) సైన్యం ప్రకటించింది. ఆదివారం ఉదయం కాంగో, విదేశీ సాయుధులు తిరుగుబాటుకు యత్నించగా, దానిని భగ్నం చేసినట్లు డీఆర్‌సీ సైనిక అధికార ప్రతినిధి సిల్వియన్ ఎకెంగె ఒక ప్రకటన చేశారు. తిరుగుబాటుదారులను బంధించారా లేక హతమార్చారా అన్నది వెల్లడించలేదు. అధ్యక్ష భవనంపై దాడిని అధ్యక్షుని అధికార ప్రతినిధి టీనా సలామా ధృవీకరించారు. సైన్యం పరిస్థితిని అదుపులోకి తేగలిగినట్లు తెలిపారు. అంతా ప్రశాంతంగా ఉందన్నారు. ఇదే క్రమంలలో అమెరికా దౌత్య కార్యాలయం ఒక భద్రతాపరమైన హెచ్చరికను జారీచేసింది. డీఆర్‌సీలో విద్రోహ చర్య, కాల్పులను ప్రస్తావించింది.

గాజాలో యుద్ధం ఆపండి

ఇజ్రాయిల్, సైప్రెస్ కమ్యూనిస్టుల డిమాండ్

జెరూసలేం: గాజాలో యుద్ధాన్ని తక్షణమే ఆపాలంటూ ఇజ్రాయిల్, సైప్రెస్ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేశాయి. సైప్రెస్ ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ వర్కింగ్ పీపుల్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుల మధ్య ఈనెల 17న జరిగిన సమావేశం ఈమేరకు తీర్మానించింది. గాజాలో పరిస్థితి, ఇజ్రాయిల్ దురాక్రమణ గురించి ఈ సమావేశం చర్చించింది. పలస్తీనాకు సంఘీభావం ప్రకటించింది, ఇజ్రాయిల్‌లోని నెతన్యాహు ప్రభుత్వం నేరపూరిత విధానాన్ని దుయ్యబట్టింది. దీనిని వ్యతిరేకిస్తూనే ఉంటామని పేర్కొంది. పలస్తీనా విమోచనం, గాజా ప్రజలకు యుద్ధం నుంచి విముక్తి కోసం తమ పోరాటం కొనసాగుతుందని రెండు పార్టీల ప్రకటనలు పేర్కొన్నాయి.

ఐదు రోజుల కస్టడీకి విభవ్ కుమార్

(మొదటిపేజీ తరువాయి)

రోజుల తమ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు విజ్ఞప్తి చేశారు. దీంతో న్యాయస్థానం శనివారం అర్ధరాత్రి విచారణ తర్వాత ఆయనకు మే 23 వరకు కస్టడీ విధించింది. మరోవైపు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దిల్లీ కోర్టు తిరస్కరించింది. 'ఈ కేసులో పోలీసు కస్టడీకి రిమాండ్ అవసరమని నేను గుర్తించాను. దీని ప్రకారం ఐవో (దర్యాప్తు అధికారి) సమర్పించిన దరఖాస్తు పాక్షికంగా అనుమతించబడింది. నిందితుడిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి రిమాండ్‌కు తరలించండి' అని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గౌరవ్ గోయల్ పేర్కొంటూ, మే 24న కోర్టు ముందు హాజరుపర్చాలని దిల్లీ పోలీసులను ఆదేశించారు. ఈ కేసుకు సంబంధించి గురువారం ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) దాఖలయింది. ఈ వారం ప్రారంభంలో ఆమె కేజ్రీవాల్‌ను కలిసేందుకు వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి నివాసం వద్ద విభవ్ కుమార్ తనను ఛాతీపై తన్నడంతో పాటు ఉద్దేశపూర్వకంగా తన చొక్కా పైకి లాగాడని, తనను ఏడెనిమిది సార్లు చెప్పుతో కొట్టాడని ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు. సన్నిహితుడు కుమార్‌ను మే 18 మధ్యాహ్నం దిల్లీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతని ముందస్తు బెయిల్‌పై కోర్టులో వాదనలు వినిపిస్తుండగా సాయంత్రం అధికారికంగా అరెస్టు చేశారు. రాత్రి 9.15 గంటలకు కోర్టు ముందు హాజరుపరచగా, ఏడు రోజుల కస్టడీకి పోలీసులు కోరారు. దిల్లీ పోలీసులు ఈ కేసు 'ఒక మహిళా పార్లమెంటు సభ్యురాలిపై క్రూరమైన దాడి' అని కోర్టుకు తెలిపారు. ఈ ఘటనతో కూడిన డీవీఆర్‌ను అందించలేదని, దిల్లీ పోలీసులకు అందించిన సీసీటీవీ ఫుటేజీని తనిఖీ చేసినప్పుడు అది ఖాళీగా ఉన్నట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. కుమార్ అందించిన మొబైల్ ఫోన్ కూడా ఫార్మాట్ చేయబడినట్లు తేలిందని, అతను తన మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్‌ను పంచుకోవడానికి ఇష్టపడలేదని దిల్లీ పోలీసులు కోర్టులో పేర్కొన్నారు. తన ఫోన్‌ను ముంబైలో ఫార్మాట్ చేసినట్లు కుమార్ వెల్లడించడంతో ఫోన్ ఫార్మాట్‌కు సంబంధించి వాస్తవాలను నిర్ధారించడానికి, తొలగించిన డేటాను తిరిగి పొందడానికి అతన్ని ముంబైకి తీసుకెళ్లాల్సి ఉందని వివరించారు. దాడికి గల కారణాన్ని తెలుసుకోవడానికి అతన్ని కూడా విచారించాల్సి ఉందని న్యాయస్థానానికి విన్నవించారు. రిమాండ్ దరఖాస్తును వ్యతిరేకిస్తూ కుమార్ తరపు న్యాయవాదులు మూడు రోజులు తర్వాత ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్రూరంగా దాడి చేశారనే ఆరోపణ ఉన్నప్పటికీ మలివాల్ వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి లేదా తనకు వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ఇష్టపడలేదని పేర్కొన్నారు. ఘటన జరిగిన తర్వాత పోలీసు స్టేషన్‌కు వెళ్లినా ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని వివరించారు. మూడు రోజుల తరువాత చర్చలు, ముదుపుల తర్వాత జరిగిందన్నారు. తన మొబైల్ ఫోన్‌కు పాస్‌వర్డ్‌ను బహిర్గతం చేయకూడదనే ప్రాథమిక హక్కు కుమార్‌కు ఉందని, ఈ ప్రయోజనం కోసం పోలీసు కస్టడీకి ఇవ్వవద్దని న్యాయవాదులు వాదించారు.

ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందుగానే దిల్లీలోని పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఐటీవో మెట్రో స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేశారు. బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది ఆప్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయానికి రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఆప్ అంతమే బీజేపీ లక్ష్యం: కేజ్రీవాల్

ఆమ్‌ఆద్మీ పార్టీని అంతం చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీకి భవిష్యత్తులో ఆప్ సవాలుగా మారుతుందన్న భయంతోనే 'ఆపరేషన్ ఝాడు'ను ప్రారంభించిందని మండిపడ్డారు. ఆప్ నేతల అరెస్టులకు నిరసనగా బీజేపీ కార్యాలయం ముట్టడికి బయలుదేరడానికి ముందు పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. 'ఆప్ ఎదుగుదలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన చెందుతున్నారు. పార్టీ చాలా వేగంగా అభివృద్ధి చెందింది. ఆప్‌ను అణిచివేసేందుకే ఆపరేషన్ ఝాడును బీజేపీ ప్రారంభించింది. రానున్న కాలంలో ఆప్ నేతలను అరెస్ట్ చేస్తారు. బీజేపీకి ఆప్ పెద్ద సవాల్‌గా మారకుండా ఉండేందుకు భవిష్యత్తులో మా బ్యాంకు ఖాతాలు స్తంభింపజేస్తారు. పార్టీ కార్యాలయాన్ని మూసి వేసి వీధుల్లోకి తీసుకొస్తారు. ముస్ముందు మనకు పెద్ద సవాళ్లు ఉంటాయి. వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి' అని కేజ్రీవాల్ ఉద్వేగంగా ప్రసంగించారు. ఆప్‌ను మట్టికరిపించాలని మోదీ నిర్ణయించుకున్నారని, అందుకే తమ పార్టీ గురించి పదేపదే విమర్శలు చేస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. బీజేపీకి ఆప్‌ను ముప్పుగా భావించే తనకు దిల్లీ లిక్కర్ కేసులో బెయిల్ వచ్చినప్పటి నుంచి ఆపరేషన్ ఝాడు పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని మొదలు పెట్టారన్నారు. ఆప్ నేతల అరెస్టులు, పార్టీ బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్ చేయడం, ఆప్ కార్యాలయాలు మూసివేయించడం వంటివి ఆపరేషన్ ఝాడులో భాగమని తెలిపారు. మనీశ్ సిసోదియా, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్‌లను జైలుకు పంపినట్లుగానే మిగిలిన ఆప్ నేతలను కూడా జైలుకు పంపడమనే ఆటను మోదీ ఆడుతున్నారని కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. కాగా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయానికి ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నేతలందరూ వస్తారని, మోదీ ఎవరినైనా జైలుకు పంపవచ్చని కేజ్రీవాల్ శనివారమే ప్రధానికి సవాల్ విసిరిన సంగతి విదితమే. ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్‌లను కూడా జైలుకు పంపుతామని బీజేపీ నేతలు హెచ్చరిస్తున్నారని కేజ్రీవాల్ చెప్పారు. అందుకే తామే బీజేపీ ఆఫీస్‌కు వస్తామని, తమను జైలుకు పంపాలని కేజ్రీవాల్ అన్నారు. తమ పార్టీ నేతలను జైలుకు పంపడం ద్వారా ఆప్‌ను అణచివేయలేరని ఆయన అన్నారు. బీజేపీ ఎంత మంది ఆప్ నేతలను జైలులో పెట్టిందో దానికి రెట్టింపు సంఖ్యలో నాయకులు పుట్టుకొస్తారన్నారు.

కట్టలు తెంచుకున్న అభిమానం

(మొదటిపేజీ తరువాయి)

కోరినప్పటికీ జనం వినిపించుకోలేదు. తమ అభిమాన నేతలను చేరుకునే ప్రయత్నం చేశారు. దీంతో భద్రతా సమస్య తలెత్తడటం, తొక్కిసలాట జరిగేందుకు అవకాశం ఉండటంతో వాళ్లు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇదే తరహా పరిస్థితి అలహాబాద్ పార్లమెంటు స్థానం పరిధిలోని కరఛనాలో గల ముంగేరీలోనూ నెలకొంది. అక్కడ కూడా జనం బారికేడ్లు దాటుకొని వేదిక వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిని అదుపు చేయలేకపోయారు. దీంతో రాహుల్, అఖిలేశ్ ప్రసంగించకుండానే వెళ్లిపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఐదవ దశ పోలింగ్ జరగబోతోంది. ఉత్తరప్రదేశ్‌లోని కీలక స్థానాల్లో రాహుల్, స్మృతి ఇరానీ, రాజ్‌నాథ్ వంటి బడా నేతలు బరిలో నిలవడంతో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

అధికార మార్పు తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు సాధిస్తామని పదేపదే చెబుతున్నారని, వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే ఉత్తరాదిన సగం సీట్లకు, దక్షిణాదిన సున్నా సీట్లకే బీజేపీ పరిమితమవుతుందని నారాయణ చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన బలం బీజేపీకి ఉండదని చెప్పారు. పదేళ్ల కాలంలో బీజేపీ చేసిన చిన్నా చితకా మంచి చెప్పుకున్నా కొంత సానుకూలత వచ్చేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ విస్మరించారని, నల్లధనం వెనక్కి తీసుకురావడంలో విఫలమయ్యారని, పెద్ద నోట్లు రద్దుతో మోదీ సర్కారు సాధించిందేమీ లేదని ఆయన అన్నారు. ఎన్నికల్లో రూ.9 వేల కోట్లు సీజ్ చేశారంటే నిజంగా నల్లధనం నిర్మూలించారా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దొరికింది కొంతేనని, దొరకాల్సిందిలింకా చాలా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేయడానికి మోదీ ప్రభుత్వం పనిచేసిందని మండిపడ్డారు. అదానీ కుబేరుడుగా ఎదగడంలో మోదీ హస్తం ఉందని, లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్లు మోదీ శిష్యులేనన్నారు. మోదీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా చాలామంది జైలుకు వెళ్లారని, కానీ ఆర్థిక నేరగాళ్లలో ఒక్కరైనా జైలుకు వెళ్లారా అని ప్రశ్నించారు. ఆర్థిక నేరగాళ్లలో ఒక్క ముస్లిం కూడా లేదని, పైగా చాలామంది మోదీ పేరు గలవారే ఉన్నారని ఎద్దేవా చేశారు. 2014లో రూ.2.5 లక్షల కోట్ల నిరర్థక ఆస్తులు ఉంటే మోదీ వచ్చిన తరువాత అది రూ.16 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు. తెలుగు ప్రజలకు మొదటి శత్రువు నరేంద్ర మోదీ అని, పాలనలో, న్యాయవ్యవస్థలో తెలుగు వారికి అన్యాయం చేసిన వారిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ సీజేఐ వెంకటరమణ నిలుస్తారని వ్యాఖ్యానించారు. ఎన్ని రకాలుగా అవినీతి చేయవచ్చో ముఖ్యమంత్రి జగన్ నేర్పారని తెలిపారు. బతుకు తెరువు రాజకీయాల కోసం మోదీతో చంద్రబాబు చేతులు కలిపారని విమర్శించారు. రాష్ట్రంలో యువత కసితో ఓటు వేశారని, కానీ వైసీపీకి మాత్రం కాదన్నారు. జగన్‌పై వ్యతిరేకతే చంద్రబాబుకు లాభిస్తుందని, ఈ విషయంలో చంద్రబాబు... జగన్‌కు ధన్యవాదాలు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఘర్షణలకు పూర్తి బాధ్యత వైసీపీదేనన్నారు. దాడులను నియంత్రించడంలో నిఘా విభాగం, పోలీసు విభాగం, ఎన్నికల కమిషన్ వైఫల్యం చెందాయని నారాయణ విమర్శించారు. సిట్‌తో ఒరిగేదేమీ లేదని, సీఎంకు అనుకూలంగానే వారు నివేదిక ఇస్తారని, గతంలో సిట్ పనిచేసిన విధానాన్ని పరిశీలిస్తే తెలుస్తుందని అన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఎన్నికల ముందు, తరువాత చోటుచేసుకున్న రాజకీయ గొడవలపై విరుచుకుపడ్డారు. 15 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న పల్నాడులో వైసీపీ ప్రభుత్వం కారణంగా హింస చెలరేగిందని, మాచర్ల కేంద్రంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయ కక్షలను బయటకు తీసి దాడులకు ఆజ్యం పోశారని న్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే... డీజీపీ ఉత్సవ విగ్రహంలా ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కూడా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ప్రజా తీర్పులో కమ్యూనిస్టుల పాత్ర గణనీయంగా ఉందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో మోదీపై ఉన్న వ్యతిరేకత పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టంగా కనబడుతోందన్నారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగం నిలబడాలంటే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసే వారిని చిత్తుగా ఓడించే రోజులు రావాలని ఆకాంక్షించారు. ఇండియా కూటమి తరపున గుంటూరు పార్లమెంట్‌కు పోటీ చేసిన తనను ఆదరించిన ఇండియా కూటమి సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిజేశారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

నివేదిక సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సీఐ నారాయణస్వామి నుంచి సిట్ డీఎస్పీ రామ్మూర్తి వివరాలు సేకరించారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను అధికారులు పరిశీలించారు. ఏసీబీ అదనపు ఎస్పీ సౌమ్యలత నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలపైనా సిట్ అధికారులు పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరుపతిలో సిట్ విచారణ దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. భద్రతా వైఫల్యాల కారణంగానే అల్లర్లు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటివరకు నమోదు చేసిన సెక్షన్లలో మార్పులు, చేర్పులపైనా చర్చించారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లె, ఎస్వీయూ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాల్లో కొందరిని సిట్ అధికారులు విచారించారు. రామిరెడ్డిపల్లె సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ఇంటికి సిట్ అధికారులు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. స్థానికులను కలిసి అల్లర్లకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కూచువారిపల్లిల్లో వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్‌ను, గ్రామస్తులను కలిశారు. తిరుపతి నగరంలో అల్లర్లు జరిగిన ప్రాంతాలను సిట్ అధికారులు పరిశీలించారు. ఎస్వీయూ క్యాంప్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసులను పరిశీలించి, అల్లర్లకు చెందిన ఎఫ్ఐఆర్ వివరాలను ఆరా తీశారు. పద్మావతి మహిళా వర్సిటీకి అధికారులు వెళ్లి విచారణ చేశారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడి ప్రాంతాన్ని పరిశీలించింది. డీఎస్పీ రవీంద్రనాథ్ అధ్వర్యంలో సిట్ దర్యాప్తు నివేదికను సిద్ధం చేస్తున్నారు.

టీడీపీ నాయకులతో పోలీసులు కుమ్మక్కు : మంత్రి అంబటి

నరసారావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు వచ్చి సిట్ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎన్నికల సమయంలో జరిగిన హింసాత్మక సంఘటనలను మంత్రి వివరించారు. ఈ ఎన్నికల్లో ఇప్పుడు జరిగిన హింస... ఎప్పుడూ జరగలేదని వారితో చెప్పారు. టీడీపీ నాయకులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఫిర్యాదు చేశారు. దాడులు అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఎన్నికల రోజు టీడీపీ నేతల అరాచకాలను, తాజాగా పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులపైనా సిట్ బృందానికి అంబటి వివరించారు.

కొన్ని కేసుల్లో అదనపు నిందితులు చేర్చుతాం : సిట్ ఇన్‌ఛార్జి వినీత్ బ్రిజిలాల్

ఎన్నికల హింసాత్మక సంఘటనలకు సంబంధించి కొన్ని కేసుల్లో మరికొంతమందిని నిందితులుగా చేర్చాల్సి ఉందని, మరికొన్ని కేసులపై అదనపు సెక్షన్లు నమోదు చేయాల్సి ఉందని సిట్ ఇన్‌ఛార్జి వినీత్ బ్రిజిలాల్ స్పష్టం చేశారు. ఈసీ ఆదేశాల మేరకు నాలుగు జిల్లాల్లో సిట్ బృందాలు దర్యాప్తు ప్రారంభించాయని చెప్పారు. సోమవారం ఈసీకి నివేదిక అందజేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. తమ దర్యాప్తులో భాగంగా పోలీసులు తీసుకున్న చర్యలు, ఘర్షణలకు గల కారణాలపై ఆరా తీసినట్లు వివరించారు. ఈ కేసుల్లో ఉండి తప్పుకున్న వారినీ కేసుల్లో చేరుస్తామన్నారు. పల్నాడులో ఎనిమిది గంటలు, తిరుపతిలో ఏడు గంటలపాటు సిట్ బృందం విచారణ కొనసాగిందని ఆయన చెప్పారు.

భారీగా బెట్టింగులు!

(మొదటిపేజీ తరువాయి)

బహుమతులను సీజ్ చేసినట్లు ఈసీ వెల్లడించింది. ఫలితాలకు ముందు బెట్టింగులు కొనసాగుతున్నాయన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ వాటిపై ఈసీ, పోలీసులు నిఘా పెట్టడం లేదు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ ఎన్నికల మహాఘట్టం ఈనెల 13తో ముగిసింది. వైసీపీ, ఇండియా, ఎన్డీఏ కూటమి పార్టీల అభ్యర్థులు పోటీలో దిగారు. అందరూ మే 4న ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ముగియడంతో ఎవరికివారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1 సాయంత్రం వరకు సర్వేలను నిషేధించారు. దీంతో స్టడీ పేరుతో కొన్ని సంస్థలను తమ అభిప్రాయాల్ని వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని వైసీపీకి అనుకూలంగా, మరికొన్ని ఎన్డీఏ గెలుపు దిశగా చూపిస్తున్నారు. ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు బారులు తీరి ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో 81.86 శాతం ఓటింగ్ నమోదైంది. 2019 కంటే, 2024 ఎన్నికల్లో అదనంగా రెండు శాతం ఓటింగ్ పెరిగింది. ఇది ఎవరికి అనుకూలమో, ప్రతికూలమో తెలియక ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కలవరం చెందుతున్నారు. పెరిగిన ఓట్లన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకమని, అనుకూలమనే ఫీవర్‌తో రాజకీయ పార్టీల నేతలున్నారు. ఈలోగా బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. వారి దగ్గరున్న సమాచారం ఆధారంగా కోట్ల రూపాయల్లో బెట్టింగులు కాస్తున్నారు. ఇందులో అనేక అంశాలపైన బెట్టింగులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం మధ్యవర్తులు రంగంలోకి దిగినట్లు తెలిసింది.

ఎన్నికల్లో గెలుపు ఓటములపై దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా బెట్టింగులు కొనసాగినట్లు సమాచారం. ప్రధాన రాజకీయ పార్టీల నేతల గెలుపు, ఓటములు, మెజార్టీలపైనా భారీగా బెట్టింగులు జరుగుతున్నాయి. వైసీపీ అధినేత, సీఎం జగన్ పోటీకి దిగిన పులివెందులలో గతం కంటే మెజార్టీ తగ్గుతుందని, పెరుగుతుందనే దానిపై బెట్టింగులున్నాయి. వైసీపీ అధికారంలోకి వస్తుందని, కాదు... ప్రతిపక్షానికే జగన్ పరిమితమవుతారనే రీతిలో బెట్టింగ్‌లున్నాయి. ఎన్డీఏ అధికారంలోకి వస్తుందని, కాదు... కూటమి ప్రతిపక్షంలోనే ఉంటుందని బెట్టింగులు కాస్తున్నారు. ఎన్డీఏ కూటమికి చెందిన జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీకి దిగిన ఒక్క పిఠాపురంలోనే 400 కోట్లు బెట్టింగులు జరిగినట్లు తెలుస్తున్నది. పవన్ కల్యాణ్ ఓటమి, గెలుపుపైనే బెట్టింగులున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు పోటీ చేస్తున్న కుప్పంలో గతం కంటే మెజార్టీ తగ్గుతుందని, లేదా అసలు చంద్రబాబు ఓటమి పాలవుతారనే అంశాలపై బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. టెక్కలిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, మంగళగిరిలో టీడీపీ నాయకులు నారా లోకేశ్ గెలుపు, ఓటములపై బెట్టింగులు కాస్తున్నారు. హిందూపురం నుంచి టీడీపీ నేత బాలకృష్ణ ఓటమి ఖాయమని, కాదు...హ్యాట్రిక్ కొడతారని భావిస్తున్నారు. ఉండిలో రఘురామకృష్ణరాజు, భీమిలిలో గంటా శ్రీనివాసరావు ఓటమి తథ్యమని, కాదు గెలుస్తాడనే ధీమాతో బెట్టింగులు జరుగుతున్నాయి.

గుడివాడలో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), గన్నవరంలో వల్లభనేని వంశీ, నగరిలో వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా గెలుపు, ఓటములపై భారీగా బెట్టింగులు కడుతున్నారు. కుప్పంలో ఈసారి 90 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా నమోదైన పోలింగ్‌పై టీడీపీ, వైసీపీ తమ ధీమాలను వ్యక్తంచేస్తున్నాయి. కుప్పంలో చంద్రబాబు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయగా, దానికి ధీటుగా చంద్రబాబు ఓటమే లక్ష్యంతో వైసీపీ ఎన్నికల్లో వ్యవహరించింది. దీంతో చంద్రబాబు గెలుపు, ఓటములపైనా కోట్లాది రూపాయల బెట్టింగులు కడుతున్నారు. ఎన్డీఏ కూటమి నుంచి బీజేపీ ఎంపీలుగా పోటీ చేసిన ఆరుగురు గెలుపు, ఓటములపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో అత్యధిక అభ్యర్థులు ఓటమి పాలవుతారని, గెలుస్తారనే అంశాలపై బెట్టింగులున్నాయి. ఇప్పటికైనా ఈ బెట్టింగ్‌ల నియంత్రణకు ఈసీ, పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

పార్లమెంటు భద్రత కోసం 3300 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది

న్యూదిల్లీ: పార్లమెంటు సమగ్ర భద్రత బాధ్యతలు పూర్తిస్థాయిలో 'సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) నిర్వహించనుంది. సీఐఎస్ఎఫ్ ఉగ్రవాద నిరోధక భద్రత విభాగానికి చెందిన 3300 మందికిపైగా సిబ్బంది సోమవారం (మే 20) నుంచి విధులు నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్, దిల్లీ పోలీస్, పార్లమెంటు సెక్యూరిటీ స్టాఫ్(పీఎస్ఎస్) పార్లమెంటు భవన సముదాయంలో ఉమ్మడిగా ఈ బాధ్యతలు నిర్వహించాయి. గతేడాది డిసెంబరులో శీతాకాల సమావేశాల సమయంలో పార్లమెంటులో అలజడి ఘటన తీవ్ర కలకలం రేపడంతో భద్రతపై అనేక సందేహాలు తలెత్తాయి. దీంతో కాంప్లెక్స్‌లో సమగ్ర భద్రత బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే పాత భద్రతా సిబ్బంది స్థానంలో 3317 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నారు. డీఐజీ ర్యాంకు స్థాయి సీఆర్‌పీఎఫ్ అధికారి శుక్రవారమే కాంప్లెక్స్‌లోని అన్ని సెక్యూరిటీ పాయింట్‌లను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్లమెంటు కాంప్లెక్స్‌లోని అన్ని ప్రవేశ ద్వారాలు, అగ్నిమాపక విభాగం, సీసీటీవీ పర్యవేక్షణ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ సెంటర్, జాగిలాల స్క్వాడ్, వాచ్ టవర్ వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు. ఇప్పటికే వారికి సంబంధిత శిక్షణ ఇచ్చారు.

విధ్వంసక కార్యకలాపాల కట్టడి తదితర విధులకు ప్రత్యేకంగా శిక్షణ పొందినవారిని రంగంలోకి దించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని మోహరించారని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి అనుమతులు వస్తాయని వెల్లడించాయి. గతేడాది డిసెంబరు 13న లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా... ఇద్దరు దుండగులు విజిటర్స్ గ్యాలరీలో నుంచి సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. అదే సమయంలో పార్లమెంట్ భవనం వెలుపల ఇద్దరు వ్యక్తులు స్మోక్ క్యానిస్టర్లతో ఆందోళన చేశారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారందరినీ అదుపులోకి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా... దాదాపు 1.70 లక్షల మంది సిబ్బందితో కూడిన 'సీఐఎస్ఎఫ్'.. కేంద్ర హోంశాఖ అధీనంలోని కేంద్ర సాయుధ పోలీసు దళం. దిల్లీలోని అనేక కేంద్ర మంత్రిత్వ శాఖల భవనాలతోపాటు పౌర విమానాశ్రయాలు, అణుశక్తి, ఏరోస్పేస్ కేంద్రాలు, దిల్లీ మెట్రో వద్ద భద్రత కల్పిస్తోంది.

కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

(మొదటిపేజీ తరువాయి)

సహాయక బృందాలు, డ్రోన్లను ఘటనాస్థలికి పంపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు వెల్లడించింది. దట్టమైన పొగమంచుకు తోడు చుట్టూ కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం ఉన్నందున సహాయక చర్యలు కష్టసాధ్యమైనట్లు తెలిపింది. వాతావరణం అనుకూలించక ఎయిర్ రెస్క్యూను నిలిపివేయాల్సి వచ్చిందని, అంబులెన్సులను ఘటనాస్థలికి పంపామని అధికారులు తెలిపినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఘటనాస్థలి నుంచి అందిన సమాచారం ఆశాజనకంగా లేదని ఇరాన్ అత్యవసర సేవల అధికార ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు తెలిపారు. ఎనిమిది అంబులెన్సులను తాబ్రీజ్ నుంచి పంపామన్నారు. ఘటనాస్థలానికి రోడ్డు దూరంగా ఉండటంతో ముగ్గురు చొప్పున సభ్యులతో కూడిన అత్యవసర బృందాలను అవసరమైన పరికరాలతో, అత్యవసర వైద్యసామగ్రితో పంపినట్లు చెప్పారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక సహాయ చర్యలకు తీవ్రస్థాయిలో ఆటంకం కలిగినట్లు ఇరాన్ మంత్రులు చెప్పారు. ఇరాన్ అధ్యక్షుడి కాన్వాయ్‌లో మొత్తం మూడు హెలికాప్టర్లు ఉన్నాయని, వాటిలో రెండు గమ్యస్థానాలకు చేరుకున్నాయని టెహ్రాన్ టైమ్స్ నివేదించింది. క్విజ్ ఖలాసీ డ్యామ్‌ను ప్రారంభించేందుకు అజర్‌బైజన్ ప్రావిన్స్‌కు వెళ్లిన రైసీ తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపింది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే జాతీయ అత్యున్నత భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైందని, ఇస్లామిక్ రివల్యూషన్ నేత అయాతుల్లా సయీద్ అలీ ఖమేనీ పాల్గొన్నారని వివరించింది.

నికోబార్ దీవులకు నైరుతి

(మొదటిపేజీ తరువాయి)

మే 11న వచ్చాయి. 1972లో జూన్ 18న కేరళకు వచ్చినప్పుడు తొలి ఆగమనం జరిగింది. గత ఏడాది జూన్ 8న రుతుపవనాలు కేరళ చేరుకున్నాయి. 2022లో రుతు పవనాలు మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న కేరళకు వచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారితమైనందున రుతుపవనాల కారణంగానే దేశంలో పంటలు పండిస్తారు. ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన వేడిని ఎదుర్కొంటున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 48 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ఏడాది ఏప్రిల్ లోనే దక్షిణ భారతదేశంలో వేడిగాలులు మొదలయ్యాయి. విపరీతమైన వేడి కారణంగా పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరిగి నీటి వనరులు ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రుతుపవనాల ముందస్తు ఆగమనం గొప్ప ఉపశమనంగా భావిస్తున్నారు. వ్యవసాయం 52 శాతం వర్షంపైనే ఆధార పడి ఉంది. అందువల్ల ఖరీఫ్ పంటకు జూన్, జులైలో వర్షాలు చాలా అవసరమని అధికారులు పేర్కొన్నారు.

నేడు ఐదో విడత పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ 19, ఏప్రిల్ 26, మే 7, మే 13న నాలుగు దశలు ముగియగా మే 20న ఐదో దశ పోలింగ్ జరగనుంది. మే 25, జూన్ 1న ఆరు, ఏడు దశల పోలింగ్ ఉంటుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. గత నాలుగు దశల్లో సుమారు 60 నుంచి 69 శాతం ఓటింగ్ నమోదయింది. మే 13న 96 నియోజకవర్గాల్లో జరిగిన నాల్గవ దశ పోలింగ్‌లో ఇప్పటివరకు అత్యధికంగా 69.16 శాతం పోలింగ్ నమోదయింది. ఎన్నికల సంఘం ప్రకారం మునుపటి దశలో 69.58 శాతం మంది పురుషులు, 68.73 శాతం మంది మహిళా ఓటర్లు, 34.23 శాతం మంది థర్డ్ జెండర్ వ్యక్తులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

యూపీలో రసవత్తర పోరు

ఐదో దశలో యూపీ నుంచి రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, రాహుల్ గాంధీ సహా నలుగురు కేంద్ర మంత్రులు బరిలో ఉన్నారు. లక్నో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు కూడా ఓటింగ్ జరగనుంది. మోహన్‌లాల్‌గంజ్ (ఎస్సీ), రాయ్ బరేలీ, అమేథీ, జలౌన్ (ఎస్సీ), ఝాన్సీ, హమీర్‌పూర్, బందా, ఫతేపూర్, కౌశంబి (ఎస్సీ), బారాబంకి (ఎస్సీ), ఫైజాబాద్, కైసర్‌గంజ్, గోండా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కేంద్రమంత్రులు కౌశల్ కిషోర్ (మోహన్‌లాల్‌గంజ్), సాధ్వి నిరంజన్ జ్యోతి (ఫతేపూర్) పోటీలో ఉన్నారు. రాహుల్ గాంధీ తన తల్లి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నుంచి పోటీలో ఉన్నారు. యూపీలో 2.68 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు కాగా, 144 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ తన సిట్టింగ్ లోక్‌సభ ఎంపీలలో 11 మందికి టికెట్లు ఇచ్చింది. బారాబంకి (ఎస్సీ) స్థానం, కైసర్‌గంజ్‌లో కొత్త అభ్యర్థులను నిలబెట్టింది. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అమేథీ నుంచి కేఎల్.శర్మ, బారాబంకి (ఎస్సీ) నుంచి తనూజ్ పునియా, ఝాన్సీ నుంచి ప్రదీప్ జైన్ 'ఆదిత్య'లను పోటీకి దింపింది. మిగిలిన స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అభ్యర్థులు ఎన్నికల పోరులో ఉన్నారు. రాజ్‌నాథ్ లక్నో నుంచి నాలుగోసారి పోటీ చేస్తున్నారు. లక్నో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు కూడా ఓటింగ్ జరగనుంది. నవంబరు 9, 2023న సిట్టింగ్ ఎమ్మెల్యే అశుతోష్ టాండన్ మరణంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, ఐదవ దశ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముంబై, థానే, లక్నో వాసులు గతంలో ఓటింగ్ పట్ల ఉదాసీనత ప్రదర్శించారని, అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని ఈ నగరవాసులకు ఎన్నికల సంఘం సూచించింది.

క్రిమినల్ చట్టాలపై నేడు సుప్రీం విచారణ

న్యూదిల్లీ: కొత్త క్రిమినల్ చట్టాలపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారించనుంది. జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్‌తో కూడిన వెకేషన్ ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తుంది. కొత్త చట్టాల్లో అనేక లోటుపాట్లు ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదులపై వాదనలు వినబోతోంది. కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై స్టే కోరుతూ న్యాయవాది విశాల్ త్రివేది ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పార్లమెంటులో చర్చించకుండా, ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ నడుమ ఈ బిల్లును ఏకపక్షంగా ఆమోదించినట్లు వ్యాజ్యం పేర్కొంది. ఈ మూడు క్రిమినల్ చట్టాల తక్షణమే నిపుణుల కమిటీ పరిశీలనకు పంపాలని కోరింది.

నిబద్ధ కమ్యూనిస్టు విజయకుమార్

జల్లి విల్సన్

విశాలాంధ్ర-కంకిపాడు: కామ్రేడ్ మేరుగు విజయ కుమార్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్ కొనియాడారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో ఆదివారం విజయకుమార్ సంస్మరణ సభ జరిగింది. ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకుడు వెలగపూడి ఆజాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ విజయ్‌కుమార్ తల్లిదండ్రులు ఉపాధ్యాయులుగా పని చేస్తూ కమ్యూనిస్టు భావజాలంతో కుమారుడ్ని కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షింపజేశారన్నారు. విజయకుమార్ పిన్నవయసులోనే ఈడుపుగల్లు సర్పంచ్‌గా 1981లో ఎన్నికయ్యారని... రెండుసార్లు ఎంపీటీసీ సభ్యునిగా సేవలందించారని తెలిపారు. గ్రామ కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజాలైన సుంకర సత్యనారాయణ (మాజీ సర్పంచ్) రామబ్రహ్మం, ఉప్పులేటి మోషే, కంచర్ల యలమంద, కన్నమ్మ, మాజీ ఎమ్మెల్యే మైనేని లక్ష్మణ స్వామి, సమితి మాజీ అధ్యక్షుడు మండవ వెంకట నారాయణ, పాశం లక్ష్మణస్వామి(చిట్టియ్య), మర్రి ముత్యాలు తదితరుల సూచనలు, తర్ఫీదుతో గ్రామ పరిపాలన అందించారన్నారు. 1982లో బీహార్‌లోని రాజగిరిలో జరిగిన భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ మహాసభలో విజయ్‌కుమార్ తనకు మొదటిసారి పరిచయమయ్యారని... ఆ తర్వాత పార్టీ, వ్యవసాయ కార్మిక ఉద్యమంలోనూ కలిసి సాగామన్నారు. అప్పటి నుండి బీకేఎంయూ జాతీయ, రాష్ట్ర మహాసభల కార్యక్రమానికి తప్పకుండా హాజరయ్యేవారని విల్సన్ తెలిపారు. గ్రామంలో యువజన రాజకీయ పాఠశాల సందర్భంగా తగిన సహకారానికి ఒక వారంపాటు అమరులు దోనేపూడి దత్తుగారి సూచనతో వారింట్లోనే ఉన్నానన్నారు. రత్నం, మేరి గార్ల ఆత్మీయత, ఆదరణ మరువలేనిదన్నారు. కామ్రేడ్ విజయకుమార్ తర్వాత రిజర్వు సీటుగా ఎంపీటీసీ గెలుపులో నా పాత్ర ఉందని... నిబద్ధతగా పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి కార్యక్రమాల్లో అన్ని స్థాయిల్లో చురుకుగా పాల్గొనేవారని, 10 రోజుల పాటు ఢిల్లీ, మద్రాసు, హైదరాబాద్‌లలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాపులలో కలిసి పాల్గొన్నామన్నారు. విజయకుమార్ సతీమణి బాలాకుమారి కూడా చురుకైన, చొరవ కలిగిన మహిళా నాయకురాలని విల్సన్ తెలిపారు. ఆమె కూడా జిల్లాస్థాయి నేతగా ఉన్నారన్నారు. ఈడుపుగల్లు సర్పంచ్ స్థానం రెండవసారి రిజర్వుడు కాగా విజయ కుమార్‌ని గెలిపించుకోవాలనే పట్టుదలతో నాలుగైదు రోజులు విరామం లేకుండా శ్రమించి విజయాన్ని దక్కించు న్నామన్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న తాను ఎమ్మెల్సీ గ్రాంటు నుండి రూ. 5 లక్షలు మంజూరు చేయగా పంచాయితీ మ్యాచింగ్ గ్రాంటు కలిపి గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మించినట్లు చెప్పారు.నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన నేత, బడుగుల సంక్షేమం కోసం సామాజిక న్యాయం కావాలని పరితపించిన నేత విజయకుమార్ హఠాన్మరణం కమ్యూనిస్టు వ్యవసాయ కార్మిక ఉద్యమానికి తీరని నష్టమని, ఆ నష్టాన్ని పూడ్చవలసిన బాధ్యత ప్రస్తుత నాయకత్వంపై ఉందని జల్లి విల్సన్ పేర్కొన్నారు. విజయకుమార్‌కి జోహార్లు అర్పిస్తూ... కుటుంబసభ్యులకునా సానుభూతి తెలిపారు. సీపీఎం (ఎంఎల్) నాయకుడు ముప్పాళ్ల భార్గవశ్రీ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రజాసమస్యలపై ఒకేతాటిపైకి వచ్చి ఉద్యమాలు చేయడం ఒక శుభపరిణామన్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, కృష్ణాజిల్లా కార్యదర్శి టీ తాతయ్య, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమీందారు, ప్రజా సంఘాల నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్ మీరా, రాష్ట్ర కౌలు రైతుల సంఘ నాయకులు పీ జమలయ్య, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు బుట్టి రాయప్ప, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పీకా ఇమ్మానియేలు, సీపీఐ నాయకులు పోతురాజు నాగేశ్వరరావు, పాశం రవి, సీపీఎం నాయకులు ఎం హరిబాబు, త్రిమూర్తులు, టీడీపీ నాయకులు అను మోలు ప్రభాకరరావు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మాదు వసంతరావు, సీనియర్ జర్నలిస్టు గూడపాటి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొని విజయకుమార్ ప్రజలకు చేసిన సేవలను కొని యాడారు. విజయకుమార్‌పై రూపొందించిన ప్రత్యేక సంచికను ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఆవిష్కరించారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, కోశాధికారి ఆర్ పిచ్చయ్యలు ఆలపించిన విప్లవ గేయాలు ఆలపించారు. సభా వేదికపైకి నాయకులను సీపీఐ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు ఆహ్వానించారు. సీపీఐ సీనియర్ నాయకుడు మర్రి ముత్యాలు విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి బండి వెంకటరత్నం వందన సమర్పణ చేశారు.

పశువైద్య సేవలకు యూజర్ చార్జీలు వద్దు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పశుసంవర్ధక శాఖ సేవలకు యూజర్ చార్జీలు వసూళ్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడటాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమపై గ్రామీణ పేదలు, చిన్న, సన్నకారు రైతులు ఆధారపడి జీవిస్తున్నారని వారిని ప్రోత్సహించాల్సింది పోయి వారిపై భారాలు మోపడం సరికాదన్నారు. ఇప్పటికే పశు బీమా నష్ట పరిహారం చెల్లించడంలోను, మినీ గోకులాలు నిర్మించిన వాటికి డబ్బులు చెల్లించడంలోనూ ఘోరంగా విఫలమైందన్నారు. పైగా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పశు భీమా పథకాన్ని తీసుకువచ్చి రైతులు తమ వాటా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడం దుర్మార్గమని ఖండించారు. గతంలో ప్రభుత్వం లీటరు పాలకు నాలుగు రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ఐదేళ్లో ఒక్క పైసా కూడా ఇవ్వకుండా పాడి రైతులను మోసగించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల, పశుపోషకుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, పశు వైద్య సేవలకు రుసుం వసూలు చేసే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పశు వైద్యాన్ని అందుబాటులో తీసుకొచ్చేందుకు మరింత పటిష్టపరిచి పాడి రైతులను ప్రోత్సహించడానికి విధానపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు

ఎన్నికల అధికారికి మల్లాది, నారాయణమూర్తి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలింగ్ రోజున, ఆ తర్వాత టీడీపీ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో హింసకు, దౌర్జన్యాలకు పాల్పడిన దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టాలని వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ కేంద్రాలలో వీడియో రికార్డింగ్, సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆ పార్టీ కార్యకర్తలతో వైసీపీకి చెందిన నిమ్మాడ పంచాయతీ చినవెంకటాపురానికి చెందిన తోట మల్లేశ్‌పై దాడి చేయించారని తెలిపారు. మల్లేశ్ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. టీడీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నందుకే అతనిపై దాడి చేయించారని, అందువల్ల ఎన్నికల నిబంధనలను అనుసరించి అచ్చెన్నాయుడు, హరివరప్రసాద్, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఎన్నికల సందర్భంగా వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని, దళితులకు సంబంధించి దూషణలు చేశారని తెలిపారు. పెదగిరి మండలం కొప్పుల వారి గూడెంకు చెందిన రాజశేఖర్‌ను అరెస్ట్ చేయగా, పోలీసులపై దాడి చేసి అతనిని విడిపించుకుని వెళ్లాడని గుర్తు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి రిటర్నింగ్ అధికారులకు అందిన వాటిలో కవర్లపై పేర్లు లేకపోవడం, ఇతరత్రా సంతకాలు లేకపోవడం వంటివి ఉన్నాయని, వాటిపై ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పరిగణించి, సరైన పద్ధతిలో కౌంటింగ్ చేయాలని కోరారు.

ఐఏఎస్ అధికారుల బదిలీల్లో వివక్ష: విజయ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల సమయంలో హింసాత్మక సంఘటనలకు సంబంధించి ఐఏఎస్ అధికారుల బదిలీల్లో వివక్ష చూపారని రిటైర్డు ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నేత విజయ్‌కుమార్ ఆదివారం ఓ వీడియో సందేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బదిలీలు చూస్తే... వివక్షతోనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ హింసకు ఎస్పీలను, ఐఏఎస్‌లను బాధ్యులుగా చేశారన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను మాత్రం బదిలీ చేశారని... ఇదే సమయంలో అనంతపురం, తిరుపతి జిల్లాల కలెక్టర్లను బదిలీ చేయలేదని చెప్పారు. న్యాయం అనేదీ అందరికీ సమానంగా ఉండాలని, దానిలోనూ ఇక్కడున్న అధికార యంత్రాంగం స్పష్టంగా వివక్షత చూపిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. చరిత్రను పరిశీలిస్తే బలహీన వర్గాల వారే బలవుతూ వస్తున్నారని వాపోయారు. ఎప్పుడు... ఏ సంఘటన జరిగినా బలహీన వర్గాల వారే బలి పశువులు అవుతున్నారని చెప్పారు. ఎన్నికల ముందు అనంతపురం, కృష్ణా, తిరుపతి జిల్లాల కలెక్టర్లను మార్చారన్నారు. వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బదిలీ చేయడాన్ని తప్పుపట్టారు. ఎప్పుడు... ఏది జరిగినా, బలి చేయడానికి ఎస్సీ, ఎస్టీ అధికారులే ఉంటారా అని ప్రశ్నించారు. ఒక ఐఏఎస్ స్థాయి అధికారులకే రక్షణ లేకుంటే, ఇక సాధారణ స్థాయి వ్యక్తుల పరిస్థితి ఎలా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీకి నివేదిక ఇచ్చే సమయంలో... ఏఏ అధికారి పాత్ర ఏమిటనేదీ ఉన్నతాధికారులు చూడాల్సిన అవసరముందన్నారు. అలాంటివి చూడకుండా ఎన్నికల ముందు ఐఏఎస్ అధికారులు రాజబాబు, లక్ష్మీషా, నేడు శివశంకర్‌ను బదిలీ చేయడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వం మార్చిన నలుగురు కలెక్టర్లలో ముగ్గురు ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని చెప్పారు. వారంతా ఎంతో సమర్థవంతంగా పనిచేశారన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కడ వివక్ష జరిగినా ఒప్పుకోబోమని, ఎక్కడ తప్పు జరిగినా పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల తరపున నిలబడతామని విజయ్‌కుమార్ స్పష్టంచేశారు.

కాలువ కాదు... చెత్తకుండి

- నిర్వహణ అధ్వానం
- మురుగుతో నిండి దుర్గంధం
- వ్యాధులు ప్రబలుతాయని ప్రజల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఏలూరు "ద డస్ట్ బిన్" అనే పేరును సార్థకం చేసుకుంటోంది. ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతం అనుకుంటే తప్పులో కాలేసినట్టే. జిల్లా కేంద్రమైన ఏలూరు... నగరం నడిబొడ్డులో ఉన్న కృష్ణ కాలువ దుస్థితి డస్ట్‌బిన్‌గా మారింది. ఈ కాలువలో నీటినే పంపుల చెరువుల్లో నింపి శుద్ధి చేసిన అనంతరం ప్రజలకు తాగేందుకు సరఫరా చేస్తుంటారు. ఇరిగేషన్, నగరపాలక సంస్థ పనితీరుకు ఈ కాలువ అద్దం పడుతోంది. కాలువ నిర్వహణ అధ్వానంగా మారడంతో నగరంలో విడుదలైన మురుగునీరు, వ్యర్థాలు వచ్చి చేరడంతో ఈ కాలువ డ్రెయినేజీని తలపిస్తోంది. 'మన ఏలూరు-స్వచ్ఛ నగరం' పేరుతో రెండేళ్ల క్రితం సుమారు రూ.50 లక్షలు వెచ్చించి పూడికతీత పనులు చేపట్టారు. అనంతరం నిర్వహణ కొరవడటంతో ఇలా మారింది. ప్రస్తుతం పడమటిలాకుల నుంచి తూర్పులాకుల వరకు నగరం మధ్యలో నుంచి వెళు తున్న కృష్ణ కాలువ యావత్తు గుర్రపు డెక్క పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, మురుగునీటితో నిండిపోయి దుర్గంధ భరితంగా మారింది. పరిసర ప్రాంత వ్యాపారులందరూ కృష్ణ కాలువను డస్ట్‌బిన్‌గా వాడుకుంటూ చెత్తతో నింపేస్తున్నారు. మరికొందరు కాలవ ఇరువైపు గట్లను బహిర్భూమికి, మూత్ర విసర్జనకు వినియోగిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ముక్కుపుటలు అదిరిపోయేలా తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో అంటు రోగాలు ప్రబలుతాయని భయాందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి పూడిక తొలగించి, కృష్ణ కాలువకు ఇరువైపులా ఉన్న గట్లను పార్కులుగా తీర్చిదిద్దాలని నగర ప్రజలు కోరుతున్నారు.

భూటాన్‌లో బుద్ధవనం బ్రోచర్ ఆవిష్కరణ

థింపూ: తెలంగాణ బౌద్ధ పర్యాటక స్థావరాలను త్వరలో సందర్శిస్తామని భూటాన్ పర్యాటక సమాఖ్య ప్రతినిధి, ఐ-డిజైర్ అధినేత పరశు రాం బిస్వా వెల్లడించారు. భూటాన్ లోని థింపూ నగరంలో ఆదివారం అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక సదస్సు ముగింపు సభ జరిగింది. అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్, భూటాన్ పర్యాటక సమాఖ్య సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో తెలంగాణ బౌద్ధ పర్యాటక స్థావరాలు, నాగార్జునసాగర్‌లో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్మించిన బుద్ధవనం... దాని ప్రత్యేకతలపై బుద్ధవనం కన్సల్టెంట్ డా. ఈమని శివనాగిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా బిస్వా మాట్లాడుతూ అనేక ప్రత్యేకతలున్న బుద్ధవనాన్ని త్వరలోనే సందర్శిస్తామని తెలిపారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాయల్ భూటాన్ విశ్వవిద్యాలయ ఆచార్యులు, డా. సౌరవ్ బసు, ఏబీటీవో ప్రధాన కార్యదర్శి డా. కౌలేష్ కుమార్ బుద్ధవనం బ్రోచర్‌ను ఆవిష్కరించగా... శివనాగిరెడ్డి ప్రతినిధులకు బ్రోచర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్ దేశాల స్థానిక ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు గౌరవ వేతనం చెల్లించాలి

సీఈవో మీనాకు ఎంఈఓ-1 అసోసియేషన్ లేఖ

విశాలాంధ్ర-పార్వతీపురం: 2024 ఆంధ్ర ప్రదేశ్ సాధారణ ఎన్నికల్లో సెక్టార్ అధికారులుగా విధులు నిర్వహించిన ఎంఈఓలకు, ఇతర శాఖల అధికారులకు తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన మాదిరిగా ఒక నెల జీతం గౌరవ వేతనంగా చెల్లించాలని మండల విద్యాశాఖ అధికారుల సంఘం-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముకేశ్ కుమార్ మీనాకు లేఖ రాశారు. 2024 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాధారణ ఎన్నికల విధుల నిమిత్తం గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది మే నెల 14వ తేదీ వరకు దాదాపు ఆరు నెలల కాలం సెక్టార్ అధికారులుగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల ప్రకారం ఎన్నికల విధులను నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల పొరుగు రాష్ట్రం తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో సెక్టార్ అధికారులుగా విధులు నిర్వహించిన వారికి ఒక నెల జీతం గౌరవ వేతనం చెల్లించారని, మన రాష్ట్రంలో కూడా అదేవిధంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సింహాచలం కోరారు.

ఈఏపీసెట్‌కు 95.12శాతం హాజరు

విశాలాంధ్ర- కాకినాడ: జేఎన్‌టీయూ కాకినాడ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2024 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నాల్గవ రోజు మే 19వ తేదీ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా, హైదరాబాద్‌లోనూ ఏర్పాటు చేసినట పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ ప్రొ.జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ఒక సెషన్‌కు మాత్రమే పరీక్ష నిర్వహించినట్లు వివరించారు. ఆదివారం మధ్యాహ్నం ఇంజినీరింగ్ విభాగానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 30,275 మంది విద్యార్థులకు గాను 28,799 మంది (95.12 శాతం)హాజరయ్యారని, 1476మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ. కే వెంకటరెడ్డి తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో 927మంది విద్యార్థులకు గాను 897మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు.

కమ్యూనిజానికి అడ్డుకట్ట మోదీ తరంకాదు

వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కమ్యూనిజానికి అడ్డుకట్ట వేయడం మోదీ తరం కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన్ కేంద్రంలో స్మారకోపన్యాసం నిర్వహించారు. 'మతోన్మాదం- రాజ్యాంగం-ప్రస్తుత సవాళ్లు' అనే అంశంపై నేతలు ప్రసంగించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రాసినప్పుడు కమ్యూనిజానికి భూతం ఆవరించిం దంటూ అమెరికా వ్యంగ్యాస్త్రాలు రాసింది కానీ వాస్తవానికి అమెరికానే ఈరోజు భయం అనే భూతం ఆవరించిందని తెలిపారు. ఆసియా ఖండాలపై చైనా పలుకుబడిని దెబ్బతీసి అమెరికా తన ఆధిపత్యాన్ని పెంచుకోవాలని చూస్తోందని, దీనికి కారణం కమ్యూనిజం ఎక్కడ వస్తుందోనన్న భయమని అన్నారు. ప్రస్తుత భారతదేశంలో ప్రధాని మోదీ ఎక్కడైనా చైనాను తిట్టకుండా ఉండటం లేదని తెలిపారు. భారత్‌లో విదేశీ వ్యాపారంలో ప్రధానంగా ఉన్నది చైనానే అన్నారు. చైనాతో వ్యాపారం లాభాలు వారికి కావాలి కానీ చైనా కమ్యూనిజం వారికొద్దని, ఇదే నేటి పెట్టుబడిదారీ విధానమని చెప్పారు. కమ్యూనిజాన్ని ఎంత అణగదొక్కాలని చూస్తే, అంతకు మించి బలంగా పైకి ఎదుగుతుందని గత 30 సంవత్సరాల చరిత్ర నిరూపించిందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో మతోన్మాదంతో ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించిందని, రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈ కుట్రలను అడుగడుగునా లౌకిక, ప్రజాతంత్ర వాదులు అడ్డుకుంటూనే ఉన్నారని తెలిపారు. మతోన్మాదులు, పెట్టుబడిదారుల నుంచి ఈ దేశాన్ని రక్షించుకోవడానికి కమ్యూనిస్టులు, లౌకిక, ప్రజాస్వామ్యవాదులు బలం పుంజుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టీ కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు అధ్యక్షత వహించగా, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ట్రస్టీ సభ్యులు రెడ్డి వెంకటరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.జగన్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ నాటికి పాఠ్యపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో పాఠశాలలు పున:ప్రారంభించే సమయానికి నూరు శాతం పాఠ్యపుస్తకాలను సరఫరా చేశారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో పంపిణీకి చర్యలు చేపట్టారు. ఉమ్మడిజిల్లాల ప్రాతిపదికన పాఠ్యపుస్తకాల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. జగనన్న విద్యా కానుక పేరుతో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి పైసా ఖర్చులేకుండా పాఠ్యపుస్తకాలను జగన్ ప్రభుత్వం అందజేసింది. ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలను నేరుగా పాఠశాలలకు పంపేలా చర్యలు చేపట్టారు. ఒకటి నుంచి ఏడో తరగతి పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు పంపుతారు. ఒక్క ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 3,600 పాఠశాలలు ఉండగా, నాలుగు లక్షలకుపైగా ఉన్న విద్యార్థులకు 30 లక్షల పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఇదే తరహా అన్ని జిల్లాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. వాటిని బైలింగ్వల్ విధానం (తెలుగు, ఇంగ్లీషు మాధ్యమం)లో ముద్రించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలతో పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యమవుతుందని భావించారు. పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ నేతృత్వంలో పాఠ్యపుస్తకాల ముద్రణ దాదాపు పూర్తి దశకు వచ్చింది. ఆయా ముద్రణ సంస్థలకు ఆయన స్వయంగా వెళ్లి పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. మరోవైపు ఎన్నికల సమయంలోను విద్యా సంబంధిత పోటీ పరీక్షలకు జాప్యం జరగలేదు. గురుకుల పాఠశాల, ఇంటర్, డిగ్రీ కోర్సులకు సకాలంలో ప్రవేశ పరీక్షలను నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. ఏపీ పాలిసెట్, ఏపీఈఏపీసెట్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను సకాలంలో నిర్వహించి, పరీక్షా ఫలితాలను అదే స్థాయిలో వెల్లడించారు.

చలం సాహిత్యం - సంఘ సంస్కరణా పథం

సాహితి

వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు
సెల్: 9441148158

ఏ సాహిత్యకారుడైనా తన అవగాహన మేరకు వర్తమాన, వాస్తవికాంశాల నుంచి కావ్య సృజనలు చేస్తాడు. భావుకత, ఆర్ద్రత, సామాజికతలు భావోద్విగ్నతల్ని కాలం సంపుటాల్లో నమోదు చేస్తుంటారు. సరికొత్త కోణం- సంస్కరణా పథంతో గుడిపాటి వెంకటాచలం తన సాహిత్యాన్ని, జీవితాన్ని దర్శించిన నిత్య కర్మయోగి ముఖ్యంగా చలం సాహిత్యంలో నవలలు, కథలు, నాటికలు, అనువాదం, వ్యాసాలు, లేఖలు, మ్యూజింగ్స్ వంటివి ఎన్నో విషయ పరిగ్రహణకు నోచుకున్నాయి. సంఘ సంస్కరణాభిలాషిగా తాను ఎంచుకున్న మార్గం- అందరి ఆమోదం లభించిందా లేదా అన్నట్లు కాకుండా ఆనాటి మూఢాచారాల పట్ల హేతువాద దృష్టిని అలవర్చుకున్నారు. ఒక సాధనా యోగిగా మారారు. చలం ఒక సాహిత్య పిపాసి. తాత్వికత నుంచి తన స్వభావానికి అనుగుణంగా తన్ను తాను ఉన్నతీకరించుకున్న స్వభావి. అపార ప్రేమ, అవధుల్లేని దయతో పాటు సంఘంలోని దుఃఖ కారణాల పట్ల అసహనం ప్రకటించిన రచనలెన్నో చేశారు.

చలం జీవన ప్రస్థానంలో ఎంతో వేదన, అంతర్మథనం సాగించి సారించారు. ఒక మూగ బాధని స్త్రీల పట్ల అపారమైన సృజనతో సాహిత్య పాత్రల్ని భావ వ్యక్తీకరణల్ని నిర్ద్వందంగా ప్రకటించేవారు. మంచి చెడుల ప్రస్తావనలోనూ తనదైన బాణీవాణీ సాహిత్యానుసంధానంతో పాశ్చాత్యానుబంధం మేలయిన రీతుల్లో రచనలు సాహిత్యంలో విప్లవం సృజించినట్లుగా తోస్తుంది. చలం ప్రథమ రచనల్లోనూ, ఆపై రమణాశ్రమం చేరిన తర్వాత భౌతిక దృక్పథం- ఆధ్యాత్మికతేచ్ఛలు కన్పిస్తాయి.

పిల్లల ఆట- ప్రాకృతిక శోభల గురించి ఇలా రాశారు. ఇసుకతో ఇల్లు కట్టుకుంటున్నారు. ఉత్త ఆల్చిప్పలతో ఆడుకుంటారు. ఎండుటాకులతో పడవలు చేసి, విశాల సముద్రం పైన చిర్నవ్వులతో వదులుతారు. లోకాల సముద్ర తీరాన పిల్లలు ఆడుకుంటున్నారు. పిల్లలాడుతున్నారు. అలాగే యువత పట్ల వారి భావాల్లోంచి ఒక వెల్లువని ఆ వెల్లువల్లో విచక్షణలు కోల్పోతే ప్రమాదమంటారు. అది వాస్తవాంశాలతో పోటీపడ్తుండటం, అతి మంచి చెడుల పట్ల జాగరూకులైన యువత కావాలంటారు.

ముఖ్యంగా కట్టుబాట్లు, నీతి పేరిట జరుగుతున్న ఆధిపత్య ధోరణులు, భ్రష్టు పట్టించిన మురికి సంఘటనల పట్ల ఏవగింపుని సైతం ప్రకటించారు. చలం రచనల్లో స్త్రీలకు స్వేచ్ఛ ఉండాలన్నదే తీవ్ర భావాంశం. స్వేచ్ఛా ప్రణయం ఒక ప్రచులిత పాయ మాత్రమే. జీవనాన్వేషణలో అపూర్వ సౌందర్య శోభితంగా వైవిధ్యభరిత రచనలు, వాటి పాత్రలు మనకు గోచరిస్తాయి. చలం ఒక సిద్ధాంత మేధావి. ప్రపంచ గమనానికి, వర్గ దృక్పథానికి చారిత్రక భౌతికవాద పునాదిపై ఏర్పడిన సిద్ధాంతం, కమ్యూనిజం, మార్క్స్, ఎంగిల్స్, చలం మూఢనమ్మకాలు లేని సమాజం గురించి కలగన్నారు. శాస్త్రం- శాస్త్రీయ విజ్ఞానంలోని హేతుబద్ధతలు ప్రస్తుత సమాజానికి అన్వయించుకో గలగాలన్నది చలం సూత్ర బద్ధత.

చలం ఆనాటి సనాతన మూఢాచార పరాయణుల నుంచి నిందల్ని, నిరాదరణలు మిక్కిలిగా ఎదుర్కొన్నారు. అయినా చలించని చలం తెలుగు సాహిత్యంలో అచంచలం. చలం ధృవతారగా వెలుగొందారు. ముఖ్యంగా చలం రచనలలో స్త్రీ హేతువాదాన్ని ప్రస్ఫుటంగా ప్రధాన స్రవంతిలోంచి సాహిత్యాన్ని తీసుకున్నారు. అందరూ అనుకునేంత నాస్తికుడు కాదు చలం. మూఢ విశ్వాసాలను ఖండించటం, తన రచనల్లోని పాత్రల ద్వారా జాతిని జాగృతం చేయాలన్న నిరంతర తపనపడ్డారు. చలం ప్రథమ రచనలన్నీ ఎన్నో ప్రశ్నల్ని గుమ్మరించారు. మనం భౌతికవాదులుగా కన్పించాలంటే ప్రతీ స్థిర తాత్విక తార్కిక అంశాలన్నీ ఆకళింపు చేసుకున్నారు. తన కాలం వరకు ఏ ఆచారాన్ని ఆమోదించని నాస్తికుడు కాదు. ఏ వ్యవస్థని కిమ్మనకుండా గౌరవించలేదు. సాంఘిక మర్యాదను పాటించలేదన్న అపవాదు మూట కట్టుకున్నా కేవలం కులాన్ని మతాన్ని ఆచారాల్ని తృణీకరించారు చలం. ఈ భౌతిక వాదాన్ని 1930 లో విప్లవాత్మక దృష్టితో పరిగణించాల్సి ఉంటుంది. జాతి పురోగమించాలి. ముందు చూపుతోగాని, వెనుక చూపుతో కాదన్న ప్రతిధ్వనితో జీవించారు చలం.

లక్షలాది పాఠకులు చలం రచనల్ని ఆదరించారు. అసలు లైంగికోద్రిక్తతలకు లోనవకుండా భావుకులు కాలేకపోయారు. ఇంతకీ చలం దృష్టిలో ప్రేమ, ఆదరణవాదం, ఆత్మార్పణం, యాంత్రిక వాదపు క్షణికోద్రేకాలు శారీరక సంబంధాల్నించి విడివడలిగారు. అందువలన జీవితం సర్వంలో ముఖతకు, వ్యక్తిగత ప్రేమ ఒక పార్శ్వం మాత్రమే. అదీ మంచి తెలివిడి కల్గిన వారు కొందరే అయ్యారు. ఒక ధీరునిగా సాధారణ భాష నుంచి అక్షర కూర్పు సాగించేలా అప్పటి వయ్యాకరణులు స్తబ్ధులు అయ్యారు. భాషా సంబంధిగా నియమ నిబంధనలకు కొత్త భాష్యం చెప్పిన ధీశాలి. ఆయనకు సుఖాల ద్వారా అందుకోవలసినవి ఏమీ లేక బతుకు వెగటుగా అన్పించినది. అందుకే శ్రీరమణుల్ని ఆయన అరుణాచలంలో దర్శించారు. భగవాన్ ఆశ్రయం కోసం ప్రయత్నించారు. చలం అంతిమ దినాల్లో ఎన్నో గంభీర క్షణాలు దాటివెళ్లాయి. అంతకు ముందరి కల్పనా సాహిత్యం ఒక ఎత్తయితే, ఆ తరువాత ఆత్మాశ్రయంతో రచనలు, ప్రేమలేఖలు, లేఖలు, మ్యూజింగ్స్ వంటివి చేరాయి. ఈశ్వరతత్వంలోని బోధనాంశాలుగా పరిగణలోనికి తీసుకొనవచ్చును. ఊర్వశి పాత్రను స్త్రీల యొక్క మమతానుభూతిని మహాయోగ యజ్ఞంగా భావించాలి. నిర్మల ప్రేమకు ఒక నవీన భాష్యం అని "మనసుపై కమ్ముకొన్న అనృతం, ఐశ్వర్యం, గర్వం, అహంకారం, అధికారం, పొరలు అడ్డం ప్రేమకు అన్నారు.

తెలుగు సాహిత్యంలో సజీవ శక్తి చలం. ఒక సార్వత్రిక సత్యాన్వేషకుడు చలం భావజాలం అర్థం చేసుకోవడం వంటి పరస్పర సమర్పణ స్థాయికి చేరుకోవడం కావ్యంలో కలకాలం నిల్చినది పురూరవ నాటిక. భౌతికవాది కాని చలం. నాకు ఒక్క నిముషం విశ్రాంతినివ్వక, మహ ప్రణయ మారుత వేగం మీదున్న, అగాధవియోగ భారం కిందనో చీల్చి, నలిపి, ఊపిరాడనీయని నా విలాపాల్ని పాలించే స్త్రీ లోకానికి నివేదితము అంటారు చలం. స్త్రీ పుస్తకంలో తన స్వీయ అభిప్రాయాల్ని ఇలా ప్రకటించారు. మానవుడు సంఘజీవే- కాదనలేం కాని ఆ సంఘం అమలు చేస్తున్న కట్టుబాట్లలో నీతి- నిజాయితీలని హేతుబద్ధంగా అంటే సరైన ఆచరణల్లోని అంశాల్ని లోటుపాట్లను ఎత్తి చూపగలగడం- సంఘ సంస్కర్తల లక్షణంగా భావించారు చలం. అసలు కట్టుబాట్లకు తిరుగుబాట్లతో ఎదిరించి ఎదురు నిలవగల సామర్థ్యం ఏ కాలంలోనైనా చాలా తక్కువ మందికే సాధ్యపడ్తుందంటారు. స్వేచ్ఛ అనే పదం విస్తృతార్థంగా చలం వాడే వారు. స్వంత వారి మీద అధికారం వదులుకోవడం, ఆ పై వచ్చే కష్టనష్టాల్ని గర్వంగా స్వీకరించగలిగే ఆత్మ సంయమన బుద్ధి అలవర్చుకోవాలంటారు. అసలు మార్పుని మూర్ఖత్వం ఏ కారణంలో చూస్తున్న వాళ్లకైనా మనం, అజ్ఞానం, వల్ల అసహాయులకి బలహీనులకు అన్యాయం చేయకూడదంటారు. తన పుస్తకాలు చదివి చెడిపోతున్నారన్న వాళ్లను తన రచనలే సమాధానం ఇస్తాయన్నారు. చలం మతాన్ని గురించి, నీతి గురించి స్త్రీ స్వేచ్ఛ పట్ల తన భావాలు విశాలం. విస్పష్టంగా అనేక సందర్భాలలో దుర్గతిని గురించి రాశారు. వస్తుతః పురుషుడిలోని పతివ్రత కథలోని సారాంశమంతా స్వకీయ స్వాతంత్ర్యానికి మానసికమైన యే ఆటంకమున్నా దానిని తొలగించుకోవడం ప్రతి వ్యక్తికీ ముఖ్యమైన విధి. స్త్రీకీ భర్త రూపంలో ఈ ఆటంకం తొలగించబడాల్సిందే అంటారు. స్త్రీకి కూడ శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు ఆవేదన ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి. అన్నిటి కన్నా విద్యకన్నా ముఖ్యం స్త్రీ స్వాతంత్ర్య ఆర్జన. మనుషుల్ని గానీ దేశాల్ని గానీ అణగదొక్కాలంటే ఆర్థిక అసహాయత్వం ముఖ్య సూత్రం. అందుచేతనే స్త్రీ ముఖ్యంగా బానిస అయ్యింది.

చలం కథానికా యాత్రలో నూరు కథలున్నా ప్రచలితంగా వెలుగులోకి వచ్చినవి 89 మాత్రమే అని పరిశోధకులు పేర్కొన్నారు. 1924 లో భార్య తదాదిగా రాశారు. 1952 వరకు సాగిన ప్రస్థావనలో ఆ రాత్రి కథ అత్యంత మలపును ఆశ్చర్యంగొలిపే కొసమెరుపుని కలిగి ఉంది. ఏదైనా ప్రపంచం అర్థం కావాలంటే సహనుభూతి- సానుభూతులు అంశాలౌతాయన్నది కథలు సారాంశాలు. చలం జీవితానికి- సాహిత్యానికి అత్యంత ప్రమాణికంగా సాగిన కథలుగా సుశీల, అప్పుడు- ఇప్పుడు, ఆమే- త్యాగం, వితంతువు, శేషమ్మ, కర్మఫలం వంటివి ఉన్నాయి. సమాజంలోని లోపలి భావాల్ని మనిషి- ఎదుటి మనిషి తన మీద చూపే ద్వేషం వల్లకాక ప్రేమ వల్ల మాత్రమే ఆత్మ విమర్శకు తావిస్తుందన్నది సందేశాలు.



చలం నాటికలు:

చలం నాటికల్లో ఎక్కువగా సాంఘిక సమస్యలున్నవి 22 నాటికలున్నాయి. చలం రచనలు అర్థం చేసుకోవడానికి ఎంతో సూక్ష్మ పరిశీలన- వివేచన కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా పౌరాణిక, చారిత్రక కథల్ని నవీన దృష్టితో జీవితంలోని కదలికల్లో ప్రతి అడుగుని త్యాగం, ప్రేమ అంశాల దృష్టిగా అర్థం చేసుకోవాలి. మనుషులు మనసులని విశాల దృక్పథం అలవర్చుకోవాలన్న బలీయ భావన ఈ నాటకాలు అన్నిటిలోను ఉన్నాయి. బంధుత్వాలని, బాధ్యతలని, సాంప్రదాయక నీతిని ఎదిరించి ఎదురు నిలువగల ధీశక్తి చోదనంగా ప్రచులితం కావాలన్నదే సారభూతంగా ప్రస్ఫుటీకరణ. పురుషుని యొక్క ప్రేరణ శక్తికి ఔన్నత్యానికి బలీయతల్నిచ్చేది స్త్రీ శక్తే. ముఖ్యంగా పురూరవ, జయదేవ, సావిత్రి, చిత్రాంగి, శశాంకలతో బాటు సత్యం- శివం- సుందరం నాటికలు బహుళ ఆదరణ పొందాయి. కాల్పనిక సాహిత్యంలో మేలు బంతిగా పురూరవ నాటకం నిలిచింది.

చలం నవలలు:

చలం సాహిత్య సృజనశీలిగా, నిత్య సత్యాన్వేషిగా జీవనంగా, సాహిత్యం, తాత్వికతలు పునాదులుగా చేసుకున్నారు. ఒక అన్వేషణా దృష్టి, ఆత్మ ద్రవ్యానికి ప్రతిపాదించిన రచనలు తెలుగు సాహిత్యంలో 1921 నుంచి 1948 వరకు 27 ఏళ్ల ప్రశ్నలు- జవాబులు కాలం నావపై రాసినవిగా శశిరేఖ, దైవమిచ్చిన భార్య, అమీనా 1, 2 భాగాలు, మైదానం, వివాహం, బ్రాహ్మణీకం, అరుణ, అమీనా 3, 4 భాగాలు చివరకు జీవితాదర్శం వరకు ఉన్నాయి. ముఖ్యాంశంగా సంఘం- దాని పాపకార్యాలు, వైయక్తికానుభవాలు, వివాహ వ్యవస్థ, సిద్ధాంత ప్రతిపాదనలు, చర్చలు, అంతరంగ పరిశీలనతో సంచలనాత్మక సంఘటనలుగా రూపుదిద్దుకున్నాయి. అందుకే స్పందించే హృదయాలకు మించి గొప్ప శాంతి లేదన్నారు చలం. ప్రేమకు అతీతమైన విలువైనది జీవనాదర్శం నవలగా భావించవచ్చు. అలాగే 1963 లో బైబిల్ కథ ఆధారంగా మార్తా పాత్ర ద్వారా ఏసు ప్రేమను విశదపర్చారు. చివరాఖరికి తాను పెంచుకున్న ముద్దుపేరు గోరువంకను కూడా బుజ్జిగాడుగా ఆదరించారు. అలాగే పక్షిని కూడా సహజీవిగా ఉన్నత భావనా స్థితిలో దర్శించగలిగిన సంయమన యోగి చలం.

చలం వ్యాసాలు రెండు విధాలుగా ఉన్నాయి:

అక్షర సౌలభ్యత, సృజనశీలతలో పాటు విమర్శకత, తులనాత్మక అధ్యయనానికి చలం వ్యాసం ఎత్తుగడలు, ముగింపులు మార్గదర్శకాలు. పాఠకులకు హృదయానుభూతిని, అంతర్లీన ఆలోచనా ధోరణి లోంచి ఒక మాధుర్యం, ఆత్మీయంగా చదివింపజేసే లక్షణం చలం వ్యాసాలు. ఉజ్వల మణి దర్పణాలు అని అందుకే అంటారు. చదువరులకు వచనంలో వాడి- వేడిల సమ్మిళితం పురి విప్పిన నెమలి నాట్యంలో బాసిస్తాయి. సహృదయ లోకాల్లో అప్రమేయానుభవం, సహానుభవశీలత అనుభవేకవేజ్యమవుతాయి. చలం మూగబాధ తరతరాలుగా స్త్రీల పట్ల సమాజ వివక్షతగా పాఠకులను విచలితుల్ని చేస్తుంది. ఈ సాంద్ర రచనలలో కొండొకచో ఆంగ్ల సాహిత్య ప్రభావం ప్రతిబింబిస్తుంది.

తరాల తెలుగు సాహిత్యంలో ఉన్నంతలో గొప్పగా కాలానికి నిలిచేలా సాహిత్య సృజన చేసిన వారు ఎందరో ఉన్నారు. లోకాన్ని అధ్యయనం చేయడం, సాహిత్య సంస్కారాల్ని ఒంటబట్టించుకోవడం, సంస్కరణా పథంలో రచనలు సాగించిన వారెందరో ఉన్నారు. ఆనాటి అసమానతలపై ముఖ్యంగా స్త్రీ జనోద్ధరణ, సాంఘిక దురాచారాలపై నిరసన గళం సవరించిన సాహితీమూర్తులలో చలం కూడా ఒకరు. సంస్కృతి, సాహిత్యాలు విశ్వజనీనాలు అని భాషా ప్రాంతాలకు అస్థిత్వ మూలాలు. మానవులలో సంస్కృతిని నింపడానికి సాహిత్యం మూల హేతువు.

గత శతాబ్దాల నవలా సాహిత్యాన్ని, వివిధ నవలాకారులు ఎంచుకున్న వస్తు శిల్పాదులు- సారూప్యత, సమకాలీనత ప్రధాన స్రవంతిలో నిల్చిందని చెప్పాలి. అయితే చలం కాల్పనికోద్యమం తొలినాళ్లలో కుటుంబం, తీవ్రమైన సిద్ధాంతాలు, రాజకీయ కుటుంబ వ్యవస్థలపై నిరసనలతో సంస్కరించాలనే సందేశం యిమిడి ఉంది. పాశ్చాత్య నాగరికత వ్యామోహం ఉన్నవారిలా చలం విమర్శకులకు తావిచ్చారు. కానీ సగటు భారతీయ ధర్మాలు, విదేశీ దృక్పథాల ప్రభావాలు, అంతేవాసిగా వైరుధ్యాల్ని సూత్రబద్ధం చేశారు. అతి సాధారణ కుటుంబాలలో- అతి పేద మధ్య, ధనిక తరగతుల స్త్రీల జీవన సరళుల్ని సున్నితంగా పరిశీలించారు. అప్పటి అమానవీయ ఘటనలపై అత్యంత ప్రభావితమైన రచనలతో తన అసంతృప్తిని రచనల్లో తెలిపారు. సరిగా ఈ కోణంలోనే సాహిత్యం ప్రతిబింబించి చలం జీవితంలో ప్రతిఫలించాయి. చలం రచనలు అన్నీ సంచలనాలే అయ్యాయి.

ఏ విషయంలోనైనా పూర్తిగా మునిగి దానికి తార్కిక, మానసిక పర్యావసానాలు తరచి చూసేవారు. దానికి సత్య మార్గమే సరియైనదని ఎంచుకున్నారు. చలం సాహిత్యంలో కథలు, లేఖలు, అనువాదం అన్నీ ఒక నిర్దిష్ట ప్రణాళికతో సాగాయి.

ఎంతో వేదన, యథాభరితంగా అంతర్మథనంతో పాటు అంధకారంలో అన్వేషణ సాగించిన చలం ఒక సాహిత్య పిపాసి. తాత్వికత నుంచి తన స్వభావానికి అనుగుణంగా తన్ను తాను ఉన్నతీకరించుకున్న సాధనాయోగి చలం. చలం స్వభావంలో అపార ప్రేమకు అవధి లేని దయలున్నాయి. సంఘంలోని దుఃఖ కారణాల పట్ల అసహనం, నమ్మిన సిద్ధాంతాలు పట్ల చెక్కుచెదరని విశ్వాసం ప్రకటించారు. ఆ దిశలో ఆచరణలో తీవ్రమైన సాహసమే చేశారు. అపార రసప్లావితంగా సౌందర్య దృష్టిని లక్ష్య లక్షణ సమన్వితం చేసుకున్నారు.

చలం జీవన ప్రస్థానంలో సాధారణ జీవనం, డబ్బు అవసరాలు, అవసరాన్ని వదిలించుకునేలాగ గొప్పగా ఎలా జీవించాలో నిజాచరణ వాదిగా చలాన్ని అర్థం చేసుకోవాలి. సంఘాన్ని శుద్ధి చేయడం అంటే బలవంతులైన వారి దురాచారాలపై కలంతో కలబడి పోరాటం సాగించడమే. ఈ సందర్భంలో చలం తన లోపలి శతృవుల్ని ఎదిరించారు. పోరాటాల అంతర్ బహిర్ స్వరూపాలను అంతరంగ పరిణామాలతో తన జీవితాన్ని రాబోయే తరాలకు మనో దర్పణంగా నిలిచారు.

అసలైన విషాదం

చిత్తలూరి

చట్టం తన పని తాను
చేసుకుపోతుందో లేదో తెలియదుగానీ
కులం మాత్రం నిశ్శబ్దంగా
తన పని తాను చేసుకుపోతోంది...

మనిషిగా నిన్ను నువ్వు
ఎంత పరిచయం చేసుకుందామని చూసినా
నీ పుట్టుక పునాదుల్ని తవ్వి,
నిన్నో కులంగానే గుర్తిస్తుంది...

నువ్వెంత గొప్పవాడివైనా
నిన్ను కులం త్రాసులోనే పెట్టి తూస్తుంది,
నీతోపాటు నీలాంటి వాళ్లందర్నీ
మనుషుల్లాగే భావిస్తున్నామంటూ

ఉపన్యాసాలు దంచేస్తుంది,
వేదిక దిగిపోయిన తర్వాత
నీ కులం మీదే నిన్ను లెక్కలు తీస్తుంది...

అదేం మాయో గానీ
అధికారం దగ్గర, అవసరాల దగ్గర గుర్తుకురాని కులం
కుటుంబాలుగా కలిసే దగ్గర మాత్రం
ప్రధాన అర్హతగా నిలుస్తుంది...
ఆకర్షణకు అడ్డురాని కులం

ప్రేమించుకుని పెళ్లయ్యే దగ్గర మాత్రం
పరువు హత్యలుగా పరిణమిస్తుంది...

ఉందో లేదో అందరికీ తెలిసిన విషయమే గానీ
మాటల్లో కులం లేదని చెపుతూ
చేతల్లో ప్రదర్శనకు పెట్టే వాళ్లను చూసినపుడే
గుండెల్లో కత్తి దిగినట్టుంటుంది.

కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేమని
ఆ మహానుభావుడెప్పుడో చెప్పినా
వీళ్లు మాత్రం
కుల మతాల పేరు చెప్పి
ప్రభుత్వాలనీ, సమాజాన్నీ నిర్మించే ప్రయత్నం చేయడమే
అసలైన విషాదం.

("అమరావతి సాహితీ మిత్రులు" సంస్థ ఫేస్ బుక్ గ్రూప్ "అమరావతి సాహితీ మిత్రులు" లో నిర్వహిస్తున్న "వారం వారం వచన కవితల పోటీలు' భాగంగా "కులం" అనే అంశంపై వచ్చిన కవితల్లో ఒకటి)

రూపాయల వాన

వాతావరణ శాఖ
ఎలాంటి హెచ్చరిక చేయలేదు
నాయకుల పాపాల పుణ్యాన
రెండు రోజులుగా
రూపాయల వాన పడుతుంది

ఏరుకోండి ఏరుకోండి
మా మంచి అవకాశం
గాలి వచ్చినప్పుడే తూర్పారపట్టాలి

ఎన్నికలు వచ్చినప్పుడే
ఆశల పూలు పూయిస్తారు

అడగకండి ప్రశ్నించకండి
నాయకులు చెప్పింది వినండి
గొర్రె దాటుగా తలవంచుకు నడవండి

కంటిపాపలాటి దీపాలు ఆర్పే
కార్యక్రమం త్వరలో ప్రకటించి
ప్రారంభ ఉత్సవం చేస్తారు

గత రెండు రోజులుగా
ముందస్తు చెప్పాపెట్టకుండా
మందు మధురామృతం కురుస్తుంది
చాతక పక్షిలా నాలిక తడుపుకోండి
రూపాయల వర్షం కురుసి వెలిసింది

తిమ్మిని బమ్మి చేసి బమ్మిని తిమ్మి చేసి
పాలకులారా గద్దెను ఏలుకోండి!
పాలితులారా ఐదేళ్లదాకా అనుభవించండి!!

జూకంటి జగన్నాథం

పిల్లల మనసుల్ని దోచే 'చక్రవర్తి ఏనుగు' కథలు

గ్రంథ సమీక్ష

బాల సాహిత్యం రాసే రచయితలు ఇటీవల కాలంలో పెరిగారు. ఒకప్పుడు బాలసాహిత్య రచయితలకు లేని ప్రోత్సాహం పురస్కారాల రూపంలో ఇప్పుడు లభించడం వలన పెద్దల కథలు, సాంఘిక కథలు రాసే రచయితలు కూడా బాలసాహిత్యం రాస్తున్నారు. పిల్లల మనసుల్ని అర్థం చేసుకొని వారిని అలరించే కథలు రాసే రచయితలు మాత్రం వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. అలా పిల్లల మనసుల్లోకి తొంగి చూసి వారిని మెప్పించే కథలు రాసే మంచి రచయితల్లో ఎస్. హనుమంతరావు ఒకరు.

గతంలో వీరు 'స్నేహ ధర్మం' పుస్తకాన్ని రాయగా ప్రచురించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారే 'చక్రవర్తి ఏనుగు' పుస్తకాన్ని కూడా ప్రచురించారు. ఈ సంపుటిలో 22 కథలు ఉన్నాయి. కథలన్నీ పిల్లలకు నచ్చే విధంగా రాసినవే. పాఠశాల తాళాల గుత్తిని బడి ప్రాంగణంలోని నూతిలో పొరపాటున అటెండర్ పడేయడంతో గదులు తెరిచే వీలు లేక హెడ్ మాస్టర్ తో సహా పిల్లలందరూ మైదానంలోనే ఉండిపోయారు. గాలంతో నూతిలో ప్రయత్నించినా తాళాల గుత్తి పైకి రాలేదు. ఆ రోజు పిల్లలకు పరీక్షలు నిర్వహించాల్సి ఉండడంతో అందరికీ ఆందోళనగానే ఉంది. దగ్గర్లోని ఇంటి నుండి తెచ్చిన సుత్తితో సైన్సు లేబరేటరీ గది తాళం పగలగొట్టి అయస్కాంతం తెచ్చారు సైన్సు మాష్టారు. అయస్కాంతాన్ని గాలానికి కట్టి నూతిలో నుండి తాళాల గుత్తిని తీశారు. శాస్త్రాన్ని జీవితానికి ఉపయోగించుకున్నప్పుడే సైన్సుకి సార్థకత అని సైన్సు మాస్టారు నిరూపించారు. కథ పేరు కూడా సైన్సు మాస్టారు. ఎవరైనా ఏదైనా చెబితే గుడ్డిగా నమ్మి ఆచరించకూడదని, అందువలన ఒక్కోసారి మంచి కంటే జరిగే చెడు ఎక్కువ అని చక్కని సందేశంతో పిల్లలకు తెలిపిన కథ తోకలేని పిట్ట. తోకలేని పిట్ట తొంభై ఊళ్ళు తిరిగిందని ఒక తాత మనవడితో చెప్పగా విన్న ఒక పిట్ట తన తోకను అరగదీసుకొని ఊళ్ళు తిరగాలనుకుంది. తోక లేకపోవడంతో ఎగరడం కష్టమై ఇబ్బందులు పడింది. అసలు నిజం తెలుసుకుంది పిట్ట.

మనం ఆహారం తినేటప్పుడు మొదటి ముద్దను కళ్ళ కద్దుకుని కంచం పక్కన పెడతాము. తరువాత దానిని తీసుకెళ్లి వీధి గోడమీద పెట్టినట్లయితే పక్షులు, చీమలు, కీటకాలు తిని కడుపు నింపుకుంటాయనే అలా చేస్తారు. ఆ విషయాన్ని పిల్లలకు నేర్పి వారి చేత కూడా చేయించినట్లయితే మూగజీవులకు ఆహారం దొరుకుతుందని తెలియపరచిన కథ మొదటి ముద్ద. కప్పల జూ సందర్శన కథలో జూ చూడాలనుకున్న కప్పలను ఉద్దేశించి రాసిన కథలో జూలోని తాబేళ్లను, చేపలను, అనేక జంతువులను పరిచయం చేశారు. జంతువుల పట్ల ఆసక్తి ఉన్న పిల్లలు ఈ కథను ముచ్చటపడి చదువుతారు. పులి, సింహం వంటి జంతువులను దగ్గర నుండి చూసి ఆనందించిన కప్పలు పాములను చూడగానే భయపడతాయి. పిల్ల కప్పలకు పాములను చూపించకుండానే తీసుకుపోతాయి. జాతి వైరం ఉన్న జంతువుల ప్రవర్తనను తెలుపుతుంది ఈ కథ.

పనిలోనైనా ప్రార్థనలోనైనా స్పష్టత ఉన్నప్పుడే అనుకున్నది నెరవేరుతుందని చెప్పే కథ పాము ప్రార్థన. మనసులో అనుకున్నది స్పష్టంగా చెప్పలేనప్పుడు ఆశించిన ఫలితాలు రావని తెలుపుతుంది.

పిల్లలు కాదు పిడుగులు కథ తమాషాగా ఉంటుంది. స్టేషన్ మాష్టారైన తండ్రిని క్వార్టర్ లోకి రమ్మని పిలవడానికి పళ్ళాల మీద గరిటలతో కొడుతూ బూరల్ని ఊదుతూ శబ్దాలు చేస్తారు ఆయన పిల్లలు. వాళ్ళు చేసిన శబ్దాలకు అప్పటివరకు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ మీద కూర్చున్న పులి వెళ్ళిపోతుంది. తండ్రిని పిలవడానికి పిల్లలు శబ్దాలు చేసినా అది పులిని వెళ్లిపోయేలా చేయడం తండ్రికి సంతోషం కలిగించింది. వారు మామూలు పిల్లలు కాదు పిడుగులు అని అందరూ ప్రశంసిస్తారు.

మొగలు చక్రవర్తి ఔరంగజేబు యొక్క ఏనుగు ఢిల్లీ పురవీధుల్లో అప్పుడప్పుడూ ఊరేగేది. ఒకసారి ఆ ఏనుగుకి గంప నిండా లడ్డూలు ఇచ్చాడు మిఠాయి కొట్టు యజమాని. ఆ లడ్డూలను ఇష్టం మీద తింది ఏనుగు. అది మొదలు ఆ వీధిలో వెళుతున్నప్పుడల్లా మిఠాయి కొట్టు దగ్గర ఆగి లడ్డూలు తినేది.



ఈ పుస్తకం కావలసిన వాళ్లు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారిని
సంప్రదించవచ్చు.
పుస్తకం పేజీలు 68 . ధర 80 రూపాయలు.

చక్రవర్తిగారి ఏనుగు లడ్డూలు తినడం చూడడానికి జనం కూడా గుమిగూడేవారు. క్రమేపి ఆ దుకాణానికి కొనుగోలుదారుల సంఖ్య పెరిగింది. చక్రవర్తి ఏనుగుకి లడ్డూలు పెట్టడానికి కొట్టు యజమాని ఎప్పుడూ బాధపడలేదు.

బడిలో ఉపాధ్యాయుల నుండి ప్రిన్సిపాల్ నుండి ప్రశంసలు లభించినా, అవి తనకు చెందవని నిజాయితీగా చెప్పిన అమ్మాయి వెన్నెల. ఆమె నిజాయితీకి మెచ్చి స్టార్ బాడ్జితో సత్కరించారు గురువులు. వెన్నెల నిజాయితీ గురించి ఆమె తల్లిదండ్రులకు చెప్పి ప్రశంసించారు ప్రిన్సిపాల్. ఆయాచితంగా లభించే ప్రశంసల కంటే కష్టించి పనిచేయడం ద్వారా లభించిన ప్రశంసలే మేలైనవి అని వెన్నెల నిజాయితీ కథ చెబుతుంది.

ఈ పుస్తకంలోని కథలన్నీ పిల్లలే పాత్రలుగా, చుట్టూ ఉండే చెట్లు, జంతువులు, వస్తువులు మాట్లాడుకున్నట్టుగా , ప్రవర్తించినట్టుగా రాసిన కథలే. కథల్లో అభూత కల్పనలకు, అతిశయాలకు అవకాశం ఇవ్వకుండా నిజజీవితంలో చుట్టూ ఉండే పిల్లలు మాట్లాడుకున్నట్టు, సంఘటనలు జరిగినట్టు, కథలను రాశారు. ఇలా రాసి మెప్పించడం ఎస్. హనుమంతరావు గారికి బాగా తెలుసు. ఈ పుస్తకంలోని కథలన్నీ అలాంటివే . పిల్లల మనస్తత్వాలను దగ్గర నుండి చూసే వాళ్లకు మాత్రమే ఇలా కథలు రాయడం సులువు అవుతుంది. బాలపాఠకులతో బాటు పెద్దలను కూడా ఆసక్తిగా చదివింప జేసే పుస్తకం ఇది.

నారంశెట్టి ఉమామహేశ్వరరావు, 9490799203

'నీటిగింజల పంట' కవితాసంపుటికి పల్లా జాతీయ కవితాపురస్కారం-2024

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా బడగాం గ్రామానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన కవితా సంపుటి "నీటిగింజల పంట" ఈ ఏడాది 'పల్లా జాతీయ కవితా పురస్కారం -2024'కు ఎంపికయినట్టు వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో యువసాహితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పల్లా కృష్ణ ప్రకటించారు.

వరుసగా ఇప్పటివరకు ఆరు సంవత్సరాలుగా ఒక ఉత్తమ కవితా సంపుటికి బహుమతి సత్కారం అందిస్తూ వస్తున్నామని, "నీటిగింజల పంట" కవితా సంపుటి ఈ వరుసలో ఏడవదని ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తెలుగేతర ప్రాంతాలకు చెందిన తెలుగు కవులు కూడా ఈ పురస్కారానికి పోటీ పడ్డారని, గట్టిపోటీ మధ్య న్యాయ నిర్ణేతలు "నీటిగింజల పంట"ను విజేతగా ఎంపిక చేశారని చెప్పారు. త్వరలో జరగబోయే సాహితీ సదస్సులో వారిని రూ.5116/- నగదు, శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో "పల్లా జాతీయ కవితా పురస్కారం-2024" అందజేసి సత్కరించగలమని నిర్వాహకులు తెలిపారు.

రాజాం రచయితలవేదిక 112వ సమావేశం

మే నెల 26 ఆదివారం ఉదయం 10.00 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 112వ సమావేశం జరుగుతుంది. పాదిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో 'శ్రీపాద కథల్లో సామాజిక జీవనం' అనే అంశంపై రాజాపు శాంతారావు ముఖ్యప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 98857 58123

సమరాంగణం 2024

బీజేడీ, బీజేపీ హోరాహోరీ

ఒడిశాలో నేడు రెండో విడత పోలింగ్

5 లోక్‌సభ, 35 అసెంబ్లీ స్థానాలకు ఎన్నిక

ఒడిశాలో రెండో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలుండగా నాలుగింటికి ఈ నెల 13న పోలింగ్ జరిగింది. రెండో విడతలో ఐదు లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఈ ఐదు లోక్‌సభ స్థానాల్లో మూడు బీజేపీ సిట్టింగ్ స్థానాలు కావడంతో ఈ ఎన్నికలు ఆ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారాయి.

ఐదు లోక్‌సభ స్థానాల్లో 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో 13 మంది కోటీశ్వరులే. సంగీతా సింగ్‌దేవ్ రూ.67.3 కోట్లతో జాబితాలో టాప్‌లో ఉన్నారు. 12 మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులున్నట్టు పేర్కొన్నారు. వీరిలో 8 మంది తీవ్ర నేరాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 21 మంది గ్రాడ్యుయేషన్, అంతకంటే ఉన్నత విద్యావంతులని ఏడీఆర్ సంస్థ ప్రకటించింది. బీజేపీకి గట్టి పట్టున్న ఈ స్థానాల్లో అధికార బీజేడీతో పాటు ఇండియా కూటమి నుంచి కూడా ఆ పార్టీకి సవాల్ ఎదురవుతోంది. సీపీఐ, సీపీఎంతో పొత్తుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలలో పోటీచేస్తోంది. రాష్ట్రంలో పూర్వవైభవాన్ని చాటేందుకు ఇండియా కూటమి పార్టీలు శ్రమిస్తున్నాయి.

రాష్ట్రంలోని పాలక బీజేడీ ఇంతవరకు గెలుపొందని ఏకైక లోక్‌సభా నియోజకవర్గం సుందర్‌గఢ్. గత మూడు ఎన్నికలలోనూ అభ్యర్థులను మార్చినప్పటికీ బీజేడీకి సానుకూల ఫలితం లభించలేదు. ఇక్కడ గత రెండు ఎన్నికల్లో గెలిచిన బీజేపీ సిట్టింగ్ ఎంపీ జుయల్ ఓరం మళ్లీ బరిలో ఉన్నారు. 1998 నుంచి ఇక్కడ ఆయన ఐదుసార్లు గెలిచారు. 2009 ఎన్నికల్లో ఓరంపై కాంగ్రెస్ నేత హేమానంద బిశ్వాస్ విజయం సాధించారు. భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీని బీజేడీ మరోసారి బరిలో దింపింది. 2014లో ఆయన 18 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రపంచ స్థాయి హాకీ స్టేడియం ఏర్పాటు, టిర్కీ ఆదరణ కలిసొచ్చి ఈసారి గట్టెక్కుతామని బీజేడీ భావిస్తోంది.

కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే జనార్దన్ దెహోరీ పోటీ చేస్తున్నారు. ఈ దఫా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో మూడు బీజేపీ చేతిలో ఉన్నాయి. రెండింట బీజేడీ, కాంగ్రెస్, సీపీఎం చెరో చోట గెలిచాయి. బీజేడీ కంచుకోట అయిన కందమాల్ లోక్‌సభా నియోజకవర్గంలో బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ విద్యావేత్త అచ్యుతానంద సామంత పోటీలో ఉన్నారు. బీజేపీ ప్రతిసారీ కొత్త అభ్యర్థిని నిలుపుతున్నా నిరాశే ఎదురవుతోంది. ఈసారి సుకాంత కుమార్ పాణిగ్రాహికి టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి అమీర్‌చంద్ నాయక్ పోటీలో ఉన్నారు. 2008 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఏర్పడిన బార్‌గఢ్‌జి స్థానంలో విజయం పార్టీల చేతులు మారుతూ వస్తోంది. ఈసారి ప్రదీప్ పురోహిత్‌కు బీజేపీ టికెటిచ్చింది. బీజేడీ పరిణీత మిశ్రాకు అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి సంజయ్ భోయ్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేడీకి మరో కంచుకోట, సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రతిష్ఠాత్మక లోక్‌సభ స్థానం అస్కా. సీఎం పోటీ చేస్తున్న హింజిలి అసెంబ్లీ స్థానం అస్కా లోక్‌సభా స్థానం పరిధిలోనే ఉంది. తండ్రి బిజూ పట్నాయక్ మరణానంతరం 1997 ఉప ఎన్నికల్లో అస్కా లోక్‌సభ నియోజకవర్గం నుంచే నవీన్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998, 1999 ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా చేశారు. ఇక్కడ ఏ అభ్యర్థినీ రెండోసారి నవీన్ కొనసాగించకపోవడం గమనార్హం.

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, రాజ వంశీకురాలు సంగీతా సింగ్‌దేవ్ తిరిగి పోటీచేస్తున్న బోలంగీర్ నియోజకవర్గంపై రాష్ట్రమంతటా ఆసక్తి నెలకొంది. బీజేడీ ఇక్కడ గతంలో పోటీచేసిన అభ్యర్థి కల్కేశ్ నారాయణ్ సింగ్‌దేవ్‌ని మార్చి కొత్త అభ్యర్థి సురేంద్ర సింగ్ భోయ్‌కి టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి మనోజ్ మిశ్రా పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి సంగీత నాలుగుసార్లు విజయం సాధించారు. ఆమె భర్త కనకవర్ధన్ సింగ్‌దేవ్ పాట్నాగఢ్-బోలంగీర్ మహారాజు రాజ్‌రాజ్ సింగ్‌దేవ్ కుమారుడు. బీజేపీ ఒడిశా రాష్ట్ర అధ్యక్షునిగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. కరువు బాధిత జిల్లా అయిన బోలంగీర్ నుంచి ఏటా 30 వేల మందికి పైగా ఉపాధి కోసం వలస పోతున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో నాలుగు బీజేడీ చేతిలో ఉన్నాయి. కాంగ్రెస్ రెండు చోట్ల, బీజేపీ ఒక స్థానంలో గెలిచాయి.

లడాఖ్ పోరు రసవత్తరం

కాషాయ పార్టీపై స్థానికుల్లో ఆగ్రహం

హస్తానికి పెరిగిన అవకాశాలు

సార్వత్రిక ఎన్నికల ఐదవ దశలో భాగంగా కేంద్ర పాలిత ప్రాంతమైన లడాఖ్‌లోని ఏకైక లోక్‌సభ స్థానానికి ఈ నెల 20న పోలింగ్ జరగబోతోంది. అధికరణ 370 రద్దు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగింపు తర్వాత జరగబోయే ఎన్నికలు కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. లడాఖ్ లోక్‌సభ నియోజకవర్గం దేశంలోనే పెద్దది. మొత్తం 173.266 చదరపు కిమీల మేర విస్తరించి ఉంది. అయితే, ఓటర్లు మాత్రం అత్యల్పంగా ఉన్నారు. ఇక్కడ ఓటర్లు కేవలం 1.82 లక్షల మంది మాత్రమే. ఈ స్థానం నుంచి ఐదుగురు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరపున త్సేరింగ్ నంగ్యెల్, బీజేపీ నుంచి తాషి గ్యాల్సన్‌తో పాటు ముగ్గురు స్వతంత్రులు బరిలో నిలిచారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు లేహ్‌కు చెందిన వారు కాగా స్వతంత్రులంతా కార్గిల్‌కు చెందిన వారు.



2014లో లడాఖ్ లోక్‌సభ స్థానాన్ని మొదటిసారిగా బీజేపీ గెలుచుకుంది. తుప్‌స్తాన్ ఛెగాంగ్ ఎంపీ అయ్యారు. ఆయన 2018లో పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం లేహ్ సర్వోన్నత సంఘానికి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్‌తో కలిసి రాష్ట్ర హోదా పునరుద్ధరణ, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేరిక కోసం పోరాడుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ గెలిచింది. జామ్‌యంగ్ త్సేరింగ్ నాంగ్యెల్ ఎన్నికయ్యారు. ఈసారి టికెట్ ఆశించి భంగపడిన ఆయన తిరుగుబాటు చేశారు.లడాఖ్ 1967లో ఏర్పాటు అయ్యింది. అప్పటి నుంచి కాంగ్రెస్ అత్యధికంగా ఆరుసార్లు గెలుపొందగా నేషనల్ కాన్ఫరెన్స్ రెండుసార్లు గెలిచింది. స్వతంత్రులు మూడు సార్లు విజయం సాధించారు. ఈ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు బీజేపీ శాయశక్తులు ఒడ్డుతుండగా పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు సాగిస్తోంది.

ఇచ్చిన హామీల అమలులో బీజేపీ పూర్తిగా విఫలం కావడంతో కమల దళంపై స్థానికులు మండిపడుతున్నారు. లడాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం వంటివి అధికార పక్షం పూర్తిగా విస్మరించింది. ఈ ఏడాది ఆరంభంలో పర్యావరణ కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ 21రోజుల పాటు నిరాహార దీక్ష చేసినప్పటికీ బీజేపీ యంత్రాంగంలో స్పందన లేకపోవడం స్థానికులకు ఆగ్రహం తెప్పించింది. 2019లో లడాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత అభివృద్ధి నేపంతో ఒకదాని తర్వాత ఒకటి ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా లడాఖ్ పర్యావరణానికి హాని కలుగుతోందని వాంగ్‌చుక్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. పరిశ్రమల కారణంగా వేడి పెరిగి మంచు పర్వతాలు కరిగిపోయే ముప్పు వాటిల్లిందని, ఈ పరిస్థితులపై అందరి దృష్టిని ఆకర్షించేందుకు నిరాహార దీక్ష చేపట్టారు కానీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. వాంగ్‌చుక్ దీక్షకు కార్గిల్ డెమొక్రటిక్ అసోసియేషన్‌తో పాటు సామాజిక-రాజకీయ సంఘాలు సంపూర్ణ మద్దతిచ్చాయి.

2019 నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు నిలిచిపోవడంతో లడాఖ్ యువత, పర్యావరణ కార్యాచరణ ఫోరం, విద్యార్థి సంఘాలు కూడా బీజేపీపై ఆగ్రహంతో ఉన్నాయి. కమల దళ తీరును తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తున్నారు. గతంలో అవకాశం ఇచ్చి తప్పు చేశామని... చేసిన తప్పు మరోసారి చేయబోమని అంటున్నారు. దీంతో లడాఖ్‌లో కమలం వికసించడం కష్టసాధ్యమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆదరణ పెరిగింది. దీంతో ఈసారి కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయి.

రాహుల్‌ది మావోయిస్టుల భాష

ప్రధాని మోదీ విమర్శలు

జెంషెడ్‌పూర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ మావోయిస్టు భాష వాడుతున్నారని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టే ముందు కంపెనీలు 50 సార్లు ఆలోచిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. పాతతరం పార్టీ వంశపారంపర్య రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, లోక్‌సభ స్థానాలను పూర్వీకుల ఆస్తులుగా పరిగణిస్తోందని ఆరోపించారు. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం జెంషెడ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ... 'కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ) ఉపయోగించే భాష ఏ పారిశ్రామికవేత్తనైనా ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టే ముందు 50 సార్లు ఆలోచింపజేస్తుంది... యువరాజు మావోయిస్టులు మాట్లాడే భాషను ఉపయోగిస్తున్నాడు. వినూత్న పద్ధతుల ద్వారా డబ్బును దోచుకుంటున్నాడు' అంటూ రాహుల్‌పై పరోక్షంగా ఆరోపణలు చేశారు. మావోయిస్టుల మాదిరిగానే రాహుల్ గాంధీ కూడా పారిశ్రామికవేత్తల నుంచి డబ్బులు దండుకుంటున్నారని మోదీ ఆరోపించారు. ప్రముఖ పారిశ్రామికవేత్తల నుంచి కాంగ్రెస్ పార్టీకి డబ్బు అందిందని మోదీ చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ ఇటీవల చేసిన విమర్శల నేపథ్యంలో ప్రధాని పై విధంగా స్పందించారు. శనివారం న్యూఢిల్లీలో రాహుల్ మాట్లాడుతూ... 'ప్రధాని మోదీతో ఎప్పుడు ఎక్కడ కావాలంటే అప్పుడు చర్చకు నేను సిద్ధంగా ఉన్నాను. కానీ ఆయన రాలేడని నేను భావిస్తున్నా. ఎందుకంటే నేను ప్రధాని మోదీని అడిగే మొదటి ప్రశ్న అదానీతో ఆయనకున్న సంబంధమేంటి అనేది' అన్నారు. కాంగ్రెస్‌కి అదానీ, అంబానీల నుంచి భారీ మొత్తంలో డబ్బు ముట్టినట్లు ప్రధాని మాట్లాడుతున్నారు కానీ ఆయన దానిపై విచారణ చేయించే ధైర్యం చేయరని రాహుల్ ఎద్దేవా చేశారు. మోదీ మాట్లాడుతూ... తాను నక్సల్స్ వెన్ను విరిచేశానని తెలిపారు. అయితే నిధుల దోపిడీ బాధ్యత కాంగ్రెస్, జేఎంఎం తీసుకున్నాయని ఆరోపించారు. "కాంగ్రెస్, ఇండియా కూటమి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వారి 'యువరాజు' పరిశ్రమలు, పారిశ్రామిక వ్యతిరేక భాషతో ఏకీభవిస్తారా? లేదా అనే దానిపై సమాధానం చెప్పడానికి నేను ధైర్యం చేస్తున్నాను" అని మోదీ అన్నారు. రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేయాలనే నిర్ణయంపై రాహుల్‌ను విమర్శిస్తూ... కాంగ్రెస్ యువరాజు, ఆయన తల్లి సోనియా గాంధీ నియోజకవర్గానికి వచ్చి హడావిడి చేయడం హాస్యాస్పదమన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలు ఇబ్బందుల్లో వీరు ఏమై పోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్, జేఎంఎంలు అవినీతిలో పీకలదాకా కూరుకుపోయాయని... ఆ పార్టీలకు దేశాభివృద్ధి పట్టదని మోదీ ఆరోపించారు. రాష్ట్రంలోని అవినీతి నాయకుల నుండి దోచుకున్న ప్రజాధనాన్ని వసూలు చేసి పేదలకు తిరిగి చెల్లిస్తానని ప్రధాని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఓ వర్గం ఓట్లకోసమే దీదీ పాట్లు

ఓ వర్గం ఓట్లు పొందేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హిందూ సంఘాలపై విమర్శల దాడి చేస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు. పశ్చిమబెంగాల్‌లోని పురూలియాలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘాలపై దీదీ వ్యాఖ్యలను ఖండించారు. టీఎంసీ వీటికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘానికి వ్యతిరేకంగా మాట్లాడి టీఎంసీ హద్దులు దాటిందని, వాటిని దీదీ బెదిరిస్తోందని ఇది కేవలం ఓ వర్గం ఓటు బ్యాంకును పొందేందుకే అని విమర్శించారు.

కాంగ్రెస్ మతం పేరుతో మైనారిటీలకు కోటా ఇవ్వలేదు

ప్రజల దృష్టి మరల్చేందుకే మోదీ తప్పుడు ప్రకటనలు

జైరాం రమేశ్

పాట్నా: మతం ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో మైనారిటీల్లోని కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (బీపీసీసీ) ప్రధాన కార్యాలయం సదాఖత్ ఆశ్రమంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నాటక వంటి రాష్ట్రాల్లో మత ప్రాతిపదికన ఎలాంటి కోటాను అందించలేదని స్పష్టం చేశారు. 'మేము రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాము. మతం ఆధారంగా రిజర్వేషన్లు, పౌరసత్వాన్ని మంజూరు చేయడానికి అంగీకరించం. సీఏఏ ద్వారా మతపరమైన మార్గాల్లో పౌరసత్వం ఇవ్వడం ద్వారా బీజేపీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది. అందువల్ల ఈ చట్టాన్ని కోర్టులో సవాలు చేశాం' అని జైరామ్ రమేశ్ తెలిపారు. ఓబీసీలు, దళితుల కోటాలను కాంగ్రెస్ లాక్కుంటోందని, వాటిని ముస్లింల సొంత ఓటు బ్యాంకుకు మళ్లిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీతో సహా బీజేపీ నేతలు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఎన్నికలవేళ అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మోదీ ఒకదాని తర్వాత మరొకటి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 'ఆయన కాళ్ల కింద భూమి కదిలిపోతోంది. అవుట్‌గోయింగ్ ప్రధానమంత్రి అని గ్రహించడంతో నిరాశలో ఉన్నారు' అన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల నుంచి స్పష్టమైన ఆదేశాన్ని పొందబోతోందని చెప్పారు. '2004లో మాదిరిగానే మేము రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత తిరిగి పుంజుకున్నట్లుగా మళ్లీ చరిత్ర సృష్టించబోతున్నాం' అన్నారు. అప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీని ఓడించలేమని అందరూ భావించారు కానీ అంచనాలు తలకిందులయ్యాయని రమేశ్ తెలిపారు. 'మా మేనిఫెస్టోపై మోదీ తప్పుడు వాదనలు చేస్తున్నారు. కుల గణన, రైతుల రుణమాఫీ, ఎంఎస్‌పీకి చట్టబద్ధ భరోసా వంటి కాంగ్రెస్ హామీలకు సంబంధించి బీజేపీ వైఖరి ఏమిటనే దానిపై ఆయన మౌనం వీడాలని' అంటూ ఆయన మోదీకి సవాల్ విసిరారు. బీజేపీ ఆవిర్భావం నుండి బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగానికి వ్యతిరేకమని రమేశ్ ఆరోపించారు. దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ తన పత్రికలో 'మనువాది సంవిధాన్' ను సమర్థిస్తూ ఒక కథనాన్ని విడుదల చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, తమిళనాడులో అణగారిన వర్గాలకు ఇచ్చిన 69 శాతం కోటానే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి, పార్టీ మాజీ అధ్యక్షుడు సీతారాం కేసరి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉండగా... దీనికి పీవీ నరసింహారావు రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా చట్టబద్ధంగా భద్రత కల్పించారన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దు చేయడానికి కూడా కాంగ్రెస్ కట్టుబడి ఉందని... అటువంటి చర్యకు తాను అనుకూలమా కాదా అన్న విషయాన్ని ప్రధాని వెల్లడించాలని డిమాండ్ చేశారు. 'మేం ఐదో దశ ఎన్నికలకు వెళ్తున్నాం. దేశంలోని మెజారిటీ ఓటర్లు ఇప్పటికే ఓటు వేశారు. మావద్ద ఉన్న సమాచారం ప్రకారం బీజేపీ బలం పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో సగానికి తగ్గిపోతోంది. దక్షిణాదిలో అది తుడిచిపెట్టుకుపోతుందని చెప్పగలం' అని రమేశ్ వివరించారు.

దిల్లీలో మండుతున్న ఎండలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఎండలు దంచికొడుతున్నాయి. జనం ఇళ్లలోంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. దిల్లీకి వచ్చే పర్యాటకులు కూడా ఎండలకు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా ఎండల తీవ్రత మరింత పెరుగుతున్నది. సుమారుగా 28 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం అత్యధికంగా 44 డిగ్రీలకు ఎండ తీవ్రత చేరింది. దాంతో వాతావరణశాఖ దిల్లీకి రెడ్ అలర్ట్ జారీచేసింది. మరో వారం రోజులపాటు దిల్లీలో ఎండలు తీవ్రంగానే ఉంటాయని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త నరేశ్ కుమార్ చెప్పారు. రానున్న ఐదు రోజులు రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో కూడా ఎండల తీవ్రత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కాగా తాము ఇండియా గేట్ సందర్శనకు వచ్చామని, ఇక్కడ ఎండలకు పిల్లలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారని పర్యాటకులు వాపోయారు. పర్యాటక ప్రదేశాల్లో తాగునీటి క్యాంపులు ఏర్పాటు చేస్తే బాగుండేదని అన్నారు.

బీజేపీ కనుసన్నల్లో దిల్లీ పోలీసులు: సౌరబ్ భరద్వాజ్

న్యూదిల్లీ: దిల్లీ పోలీసులు బీజేపీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆప్ నేత, దిల్లీ మంత్రి సౌరబ్ భరద్వాజ్ ఆదివారం ఆరోపించారు. డైరీలో రాసిన అంశాల విషయంలో గోప్యత పాటించాల్సి ఉన్నా ఆప్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వాటిని దిల్లీ పోలీసులు బహిర్గతం చేస్తున్నారని ఆరోపించారు. తొలి రోజు నుంచీ దిల్లీ పోలీసులు తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీకి ఎన్నికల్లో లబ్ధి చేకూరేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసాల నుంచి ప్రవేశ, నిష్క్రమణల వద్ద సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజ్‌ను తీసుకెళ్లారని మంత్రి వివరించారు. దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉన్నా... అందుకు విరుద్ధంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దళిత దంపతులను స్తంభానికి కట్టేసి కొట్టారు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ జిల్లాలో దళిత దంపతులను స్తంభానికి కట్టేసి కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దళిత వృద్ధ దంపతులను తీవ్రంగా కొట్టడమే కాకుండా చెప్పుల దండ వేసి ఊరేగించారు. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. బాధితుల కుమారుడు ఓ మహిళను వేధించిన ఘటనలో నిందితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. ఆ ఘటన జరిగిన తర్వాత ఆ వృద్ధ దంపతులు ఊరు విడిచి వెళ్లారని చెప్పారు. అయితే ఈ నెల 17న తిరిగి గ్రామానికి వచ్చారని, దీంతో ఆ మహిళ భర్త మరో తొమ్మిది మందితో కలిసి వృద్ధులపై దాడి చేశారని చెప్పారు. వారిద్దరిని స్తంభానికి కట్టేసి కొట్టారని, చెప్పుల దండ వేసి ఊరేగించారన్నారు. దంపతుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులంతా పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

జార్ఖండ్‌లో అమానుషం

వృద్ధుడిని నగ్నంగా బైక్‌కు కట్టి ఈడ్చుకెళ్లిన గోమూక

ఒకరి అరెస్టు

రాంచీ: గోమూకల ఆగడాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా జార్ఖండ్‌లో అమానుష ఘటన ఒకటి జరిగింది. తన పశువులతో వెళుతున్న వృద్ధుడిని అడ్డుకున్న ముగ్గురు యువకులు అతనిని గోవుల స్మగ్లర్‌గా అనుమానించి వేధింపులకు గురిచేశారు. అతని బట్టలు ఊడదీసి తమ బైకుకు కట్టేసి కొంత దూరం ఈడ్చుకెళ్లారు. దీంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన గర్వా జిల్లా, అమ్రోరా గ్రామం సమీపంలో శుక్రవారం జరిగింది.

బాధితుడు సురుస్వతి రామ్ (60) ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు బంశీధర్ నగర్ ఉంటరి సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) సత్యేంద్ర నారాయణ్ సింగ్ తెలిపారు. నిందితులను రాహుల్ దూబే, రాజేశ్ దూబే, కాశినాథ్ భుయన్‌గా గుర్తించామని, కాశీనాథ్‌ను అరెస్టు చేసి మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు. బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదులో 'పశువులతో బంశీధర్ నగర్ ఉంటరికి వెళుతుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. గోవుల స్మగ్లింగ్ చేస్తున్నట్లు ఆరోపించారు. కాదని చెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. దాడికి దిగారు. నన్ను వివస్త్రుడిని చేసి తమ బైకుకు కట్టేసి కొంత దూరం వరకు ఈడ్చుకుంటూ వెళ్లారు. ఆపై రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు' అని ఉంది.

ఖడ్గే పోస్టర్లపై సిరా

బెంగాల్‌లో పార్టీ శ్రేణుల ఆగ్రహం

అధీర్ రంజన్‌తో విభేదించడమే కారణం!

కోల్‌కతా: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేపై బెంగాల్‌లోని పార్టీ శ్రేణులలో కొందరు గుర్రుగా ఉన్నారు. పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం ఎదుట ఉన్న ఖడ్గే పోస్టర్‌పై ఆయన ముఖభాగంలో సిరా పూశారు. ఖడ్గే పోస్టర్లు, హోర్డింగులపై 'తృణమూల్ కాంగ్రెస్ ఏజెంటు' అని రాశారు. ఇది గుర్తు తెలియని వ్యక్తుల పనిగా పార్టీ వర్గాలు తెలిపాయి. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి సంబంధించి పార్టీ నేత అధీర్ రంజన్ చౌదరి వ్యాఖ్యలతో ఖడ్గే విభేధించిన క్రమంలోనే ఈ పరిణామం జరిగిందని తెలుస్తోంది. ఇద్దరు సీనియర్ నేతల మధ్య చిచ్చు పెట్టేందుకు టీఎంసీనే ఈ పని చేసివుంటుందని కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఆరోపించారు. ఖడ్గే పోస్టర్లపై సిరా పూసిన ఘటనను అధీర్ రంజన్ చౌదరి తీవ్రంగా ఖండించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్యకర్తలకు సూచించారు. దీంతో ఫిర్యాదు నమోదైంది. ఖడ్గే ముఖం పాడుచేసిన పోస్టర్లన్నీ తొలగించేశారు. ఇదిలావుంటే ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాహ్య మద్దతిస్తానని మమతా బెనర్జీ చెప్పినప్పుడు ఆమెను నమ్మలేమని, బీజేపీలోకి వెళ్లినా ఆశ్చర్యం లేదని అధీర్ రంజన్ వ్యాఖ్యానించారు. అధిర్ వ్యాఖ్యలను ఖడ్గే తప్పుపట్టారు. మమతా బెనర్జీ ఇండియా కూటమితో ఉన్నారని, ప్రభుత్వంతో కలుస్తానన్నారని ఖడ్గే చెప్పారు. ఇండియా కూటమి ఎవరు ఉంటారు, ఎవరు ఉండరన్నది నిర్ణయించేది అధిర్ రంజన్ కాదన్నారు. ఈనిర్ణయాన్ని తాను లేక అధిష్ఠానం తీసుకుంటుందని, అభ్యంతరం ఉంటే బయటకు వెళ్లవచ్చని ఖడ్గే అన్నారు. దీనికి అధీర్ రంజన్ స్పందిస్తూ 'నన్ను, నా పార్టీని బెంగాల్ రాజకీయాల్లో లేకుండా చేయాలనుకున్న వ్యక్తి పక్షాన మాట్లాడలేను.. ఇది ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పోరాటం. నేను వారి పక్షాన్నే మాట్లాడాను. మమత తన వ్యక్తిగత అజెండా కోసం రాష్ట్రంలో కాంగ్రెస్‌ను వాడుకొని ఆ తర్వాత వ్యవస్థను తుడిపెట్టాలని భావిస్తే అలా జరగనివ్వను. నా అభిప్రాయాలను ఖడ్గే వ్యతిరేకించాగానీ రాష్ట్రంలోని క్షేత్రస్థాయి కార్యకర్తల వాణిని నేను వినిపిస్తూనే ఉంటా' అని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో లెఫ్ట్‌తో కలిసి కాంగ్రెస్ పోటీ చేస్తుండటం విదితమే.

రైల్వే ఉద్యోగుల భద్రతపై దృష్టి పెట్టండి

అశ్వినీ వైష్ణవ్‌కు వినయ్ విశ్వం లేఖ

న్యూదిల్లీ: రైల్వే ఉద్యోగుల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరుతూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం ఆదివారం ఒక లేఖ రాశారు. రైల్వే ఉద్యోగులు ముఖ్యంగా టికెట్ పర్యవేక్షణ సిబ్బందిపై దాడులు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. భౌతిక దాడులు, ప్రయాణికుల దురుసు ప్రవర్తన నుంచి టికెట్ కలెక్టర్లను కాపాడేందుకుగాను పోలీసు లేక ఆర్పీఎఫ్‌తో వారికి రక్షణ కల్పించాలని కోరారు. రైళ్లు పెంచాలని, మౌలికవసతలను మెరుగు పర్చాలని సూచించారు. ఎప్పుడు ప్రయాణిస్తూ, ఎక్కువ గంటలు పనిచేసే సిబ్బందికి రక్షణ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత రైల్వేశాఖపై ఉన్నదని తన లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు. సాధారణ రైళ్లు కిటకిట లాడుతుండటంతో ప్రయాణికులతో పాటు రైల్వే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందుకోసమే టికెట్ కలెక్టర్లపై అసహనం వ్యక్తం చేయడం, దాడికి పాల్పడటం వంటివి జరుగుతు న్నాయన్నారు. ఇలాంటివి నివారించేందుకు సిబ్బంది రక్షణ, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని రైల్వే సిబ్బందికి తగు రక్షణ, భద్రత కల్పిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు.

వికసించిన 'మే పుష్పం'

విశాలాంధ్ర-విజయవాడ: ఏటా మే నెలలో ప్రకృతి ప్రియులను అలరించే మే పుష్పం వికసించింది. ఏడాదిలో ఒక్కసారే వికసించే ఈ పుష్పం అందరినీ ఆకట్టుకుం టుంది. మే నెల రాగానే ఈ పుష్పం కోసం అనేక మంది ఆసక్తిగా ఎదురు చూస్తారు. తాజాగా విజయవాడలోని సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య ఇంటి పెరట్లో ఈ పుష్పం వికసించి మురిపించింది. అయితే ఈ మే పుష్పం మొక్కకు 33 సంవత్సరాల చారిత్రక నేపథ్యం ఉండటం విశేషం. 1991లో జరిగిన ఎన్నికలలో భద్రాచలం పార్లమెంట్‌లోని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోడే రామయ్య విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిమిత్తం కామ్రేడ్ దాసరి నాగభూషణరావు సారథ్యంలో కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పార్టీకి చెందిన 5 దళాలు పాడేరుకు వెళ్లాయి. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా నుండి చెంచయ్య నేతృత్వంలో జంగాల అజయ్ కుమార్, నాయకులు పులి సాంబశివరావు, అద్దేపల్లి మురళి, అమ్మిశెట్టి శివ తదితరులతో కూడిన దాదాపు 50 మంది సీపీఐ కార్యకర్తల దళం పాడేరు వెళ్లి... జి మాడుగుల మండలంలో సోడే రామయ్య గెలుపు కోసం గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేసింది. ప్రచారం సందర్భంగా పాడేరు నియోజక వర్గం, జి మాడుగుల మండల కేంద్రంలో బసచేసిన చెంచయ్య... ఆ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు వద్ద నుండి 'మే ఫ్లవర్' మొక్కను తీసుకొని... భద్రంగా తన ఇంటికి తెచ్చి కుండీలో నాటారు. అప్పటి నుండి ఏటా మే నెలలో ఆ మొక్క నుంచి తప్పనిసరిగా పువ్వు వికసించటం జరుగుతూనే ఉంది.

ఈసీకి ఆ ధైర్యం లేదు: ఏచూరి

న్యూదిల్లీ: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రధాని మోదీ పదే పదే ఉల్లంఘిస్తున్నారని, వాటిపై తాము అనేకమార్లు ఫిర్యాదులు చేసినా ఎన్నికల సంఘం (ఈసీ) చర్యలు తీసుకోలేదని సీపీఎం తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. తప్పు చేసిన వ్యక్తులు ఉన్నత పదవుల్లో ఉన్నవారైనా సరే ధైర్యంగా చర్యలు తీసుకునే డీఎన్ఏ ప్రస్తుత ఈసీలో లేదంటూ విమర్శించింది. 'ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌లు అయోధ్య రామాలయాన్ని బుల్డోజ్ చేస్తాయ'ంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా పరిగణించాలని కోరుతూ తాము ఫిర్యాదు చేశామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. అంతకుముందు కూడా ప్రధాని మోదీ... 'ఎస్పీ, కాంగ్రెస్‌లు అయోధ్య రాముడిని మళ్లీ టెంట్‌లోకి పంపిస్తాయి. ఆలయంపైకి బుల్డోజర్లు పంపిస్తాయ'ని ఆరోపించారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ ప్రసంగాలు తరచూ సమాజంలోని సామరస్య వాతావరణాన్ని దెబ్బతీసేలా ఉంటున్నాయంటూ వీడియో, పత్రికల క్లిప్పులను పంపించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలకూ ఈసీ ఉపక్రమించలేదని ఏచూరి పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న ఈసీ... ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఏచూరి మండిపడ్డారు.

పోరాటాలతోనే విశాఖ ఉక్కు పరిరక్షణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. రామకృష్ణ ఆదివారం స్టీల్ ప్లాంట్ లోని ప్రధాన విభాగాలైన కోక్ ఓవెన్, బ్లాస్ట్ ఫర్నేస్ , ఎస్ఎంఎస్ తో పాటు రోలింగ్ మిల్స్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం దేశానికే తల మానికమని ,ఇలాంటి కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం బడా పెట్టుబడి దారులకు కట్ట బెట్టడం సరైంది కాదన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కానివ్వబో మన్నారు. రాష్ట్రం లోని పాలక పక్షం, ప్రతి పక్షం ఉక్కు ప్రైవేటీకరణ పై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కేంద్రం పై ఒత్తిడి చేయలేక పోవడం వల్లే మోదీ ఆటలు సాగుతున్నాయన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, ఈ సంపదను అమ్మే హక్కు కేంద్రానికి లేదని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఇండియా కూటమి నేతృత్వంలో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కాపాడు కోవడానికి అన్ని రాజకీయ పార్టీల తో కలసి పోరాడతామన్నారు. రామకృష్ణతో పాటు ఆయన సతీమణి సుజాత, ఉక్కు గుర్తింపు యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, సీపీఐ నాయకులు జి.ఆనంద్ తదితరులు ఉన్నారు.

మోదీని ప్రధానిని చేస్తే... పీఓకే మనదే

ఓటర్లకు యూపీ సీఎం యోగి గాలం

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులు ఇష్టానుసారం ప్రకటనలు చేస్తున్నారు. అందులో భాగంగా మరో ఆరు నెలల్లోనే పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో విలీనమవుతుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితేనే అది సాధ్యమవుతుందని చెప్పుకొచ్చారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పీవోకేని పాక్ నిర్వహించలేదని, అది భారత్‌లో విలీనమవ్వడం ఖాయమని వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం పాకిస్థాన్‌లో పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. ఈ స్థితిలో ఆ దేశం పీవోకేని నిర్వహించలేకపోతోంది. అక్కడి ప్రజలు భారత్‌లో చేరాలని బలంగా కోరుకుంటున్నారు. మోదీని మూడోసారి ప్రధానిని చేస్తే... ఆరు నెలల్లోనే పీవోకే భారత్‌లో భాగమవుతుంది' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గత పదేళ్లలో నవభారత నిర్మాణం చూశామని, సరిహద్దుల్లో భద్రతని కట్టుదిట్టం చేసి ఉగ్రవాదాన్ని అరికట్టామని చెప్పారు. మూడేళ్లుగా పాక్‌లో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని, వాటి వెనుక భారత సంస్థల హస్తం ఉన్నట్లు ఆంగ్ల పత్రిక కథనాలు పేర్కొంటు న్నాయన్నారు. భారత్‌కు బీజేపీ అత్యంత ప్రాధాన్యత నిస్తుందని, పూర్తి అంకిత భావంతో పని చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారం లోకి రావడానికి రామ్‌లల్లా అనుమతించరని యోగి పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడమే తమ మొదటి లక్ష్యమన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని సభ్యులకు ఒక విజన్ గానీ, భారత్‌ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యం గానీ లేదని చెప్పుకొచ్చారు. అయోధ్యలో ఆలయాన్ని వ్యతిరేకించే వారు... ఇటలీలో రాముడు, హనుమంతుడి ఆలయాలు నిర్మించాలని కాంగ్రెస్‌ని ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలు ఆకలితో ప్రాణాలు కోల్పోయారని, కానీ మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందిస్తోందని యోగి చెప్పుకొచ్చారు.

ఉద్యోగులకు 8 నెలల జీతం బోనస్

సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్ణయం

కౌలాలంపూర్: ప్రముఖ విమానయాన సంస్థ సింగపూర్ ఎయిర్‌లైన్స్ రికార్డు స్థాయిలో లాభాలు నమోదు చేసింది. అంచనాలకు మించి లాభాలు నమోదు చేయడంతో తన సిబ్బందికి బంపర్ ఆఫర్ అందించాలని నిర్ణయించింది. ఎనిమిది నెలల జీతం బోనస్‌గా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కరోనా మహమ్మారి కారణంగా దాదాపుగా అన్ని ఎయిర్‌లైన్ సంస్థలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించి... చైనా, హాంకాంగ్, జపాన్, తైవాన్ దేశాల సరిహద్దులు పూర్తిగా తెరచుకోవడమే తిరిగి సంస్థ లాభాల బాట పట్టడానికి కారణమని సింగపూర్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో విమానయాన సంస్థ రికార్డు స్థాయిలో 1.98 బిలియన్ డాలర్ల వార్షిక నికర లాభాన్ని నమోదు చేసింది. దీంతో మార్చి ముగిసే సమయానికి ఎయిర్‌లైన్ నికర ఆదాయం 24 శాతం పెరిగి 2.7 బిలియన్ డాలర్లకు చేరింది. ప్యాసింజర్లకు సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు కల్పించడంతో పాటు తమ ఉద్యోగుల మెరుగైన పనితీరే ఈ వృద్ధికి కారణమని కంపెనీ పేర్కొంది. అందుకే లాభాల్లో కొంత భాగాన్ని ఉద్యోగులకు బోనస్ రూపంలో చెల్లించనున్నట్లు సంస్థ ప్రకటించింది. గత సంవత్సరంలో ఏకంగా 36.4 మిలియన్ల మంది ప్రయాణికులకు సేవలు అందించినట్లు తెలిపింది. ఇలా కంపెనీ ఆర్జించిన లాభాలను బోనస్ రూపంలో ఉద్యోగులకు ఇవ్వడం ఇదేం తొలిసారి కాదు. గతంలో దుబాయ్ ఎమిరేట్స్ కూడా ఇలానే 20 వారాల జీతాన్ని బోనస్‌గా అందించింది.

మాదల శకుంతలకు నారాయణ నివాళి

విశాలాంధ్ర-గుంటూరు: నగరంలోని గొట్టిపాటి సీతారామయ్య కల్యాణ మండపంలో ఆదివారం... ఇటీవల మృతి చెందిన జనచైతన్య గ్రూపు సంస్థల డైరెక్టర్ మాదల శకుంతల చిత్రపటానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి నివాళు లర్పించిన వారిలో ఉన్నారు.

చెప్పల షాపులో నోట్ల కట్టలు

రూ.40 కోట్లు స్వాధీనం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ముగ్గురు చెప్పుల వ్యాపారుల ఇళ్లపై ఆదాయపు పన్ను శాఖ(ఐటీ) దాడులు చేసింది. వారి వద్ద లెక్కల్లో చూపని డబ్బు బయటపడింది. ముగ్గురు చెప్పుల వ్యాపారుల వద్ద ఇప్పటివరకు రూ.40 కోట్ల నగదు దొరికినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇంకా లెక్కించని నగదు ఉందని, వాటిని కూడా లెక్కిస్తామని అధికారులు తెలిపారు. వారి వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బు ఒక గది నిండా ఉందన్నారు. రూ.500 బండిళ్లను లెక్కించే బాధ్యతను బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు అప్పగించారు. 'చాలా నోట్లు ఉన్నాయి, గది మొత్తం 500-500 నోట్ల కట్టలతో నిండిపోయింది. ఇప్పటి వరకు రూ.40 కోట్లు లెక్కతేల్చగా ఇంకా లెక్క తేలాల్సి ఉంది. మిగిలిన మొత్తం లెక్కింపు జరుగుతోంది' అని అధికారులు తెలిపారు. పట్టుబడిన నగదును లెక్కించడానికి అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ చెప్పుల వ్యాపారులు ఆదాయపు పన్ను చెల్లించడం లేదనే సమాచారం అందుకున్న ఆదాయపు పన్నుశాఖ అధికారులు.. మధ్యాహ్నం సమయంలో వారి ఇళ్లపై దాడులు చేశారు. భారీ ఎత్తున నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు యూపీలోని కాన్పూర్‌లో బన్షీధర్ టొబాకో కంపెనీపై ఆదాయపు పన్ను శాఖ దాడులు నిర్వహించింది. కాన్పూర్‌తో పాటు ముంబై, దిల్లీ, గుజరాత్‌లో ఉన్న ఈ కంపెనీ బ్రాంచ్‌లలోనూ తనిఖీలు చేసింది. ఏకకాలంలో దాదాపు 20 చోట్ల దాడులు నిర్వహించారు. ఈ పొగాకు కంపెనీ తమ టర్నోవర్‌ను దాదాపు రూ.20 నుంచి 25 కోట్లుగా చూపించగా, విచారణలో కంపెనీ టర్నోవర్ రూ.100-150 కోట్లుగా తేలింది. ఈ కంపెనీ యజమానికి దిల్లీలో ఇంద్రభవనం వంటి ఇల్లు ఉంది. అక్కడ రూ.60 కోట్లకు పైగా విలువైన కార్లతో పాటు 16 కోట్ల విలువైన రోల్స్ రాయిస్ ఫాంటమ్‌ను కూడా ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నాడు న్యాయం కోసం వీధుల్లోకి... నేడు?

ఆప్ నిరసనపై మలివాల్

న్యూదిల్లీ: ఆప్ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి ఆరోపణల వ్యవహారం రోజురోజుకీ ముదురుతోంది. పార్టీ ఆదివారం నిర్వహించ తలపెట్టిన నిరసనను ఉద్దేశించి ఆమె తాజాగా తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు అవినీతి, అక్రమాలపై పోరాటం జరగ్గా... ఇప్పుడు అది నిందితుల రక్షణ కోసం జరుగుతోందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఒకప్పుడు నిర్భయకు న్యాయం చేయాలని మనమంతా వీధుల్లోకి వచ్చాం. 12 ఏళ్ల తర్వాత ఈరోజు... సీసీటీవీ ఫుటేజీని మాయం చేసి, ఫోన్‌ను ఫార్మాట్ చేసిన నిందితుణ్ని కాపాడేందుకు వీధుల్లోకి వస్తున్నామా' అని మలివాల్ ప్రశ్నించారు. తనపై దాడి చేసినట్లుగా ఆమె ఆరోపిస్తున్న కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు విభవ్ కుమార్‌కు మద్దతుగా ఆప్ ఆందోళన కార్యక్రమం జరుగుతోందని పరోక్షంగా ఆరోపించారు. ఈ మాత్రం చొరవ మాజీమంత్రి మనీశ్ సిసోదియా విషయంలో చూపి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవని మలివాల్ అన్నారు. సిసోదియా బయట ఉంటే ఈరోజు తనకు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని వ్యాఖ్యానించారు.

ఎంపీగా గెలిస్తే సినిమాలకు దూరం: కంగన

న్యూదిల్లీ: ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనావత్ సార్వత్రిక ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే సినిమాలకు దూరంగా ఉంటారా అనే ప్రశ్నకు ఆమె అవుననే సమాధానమిచ్చారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలోవామె ఈ విషయం వెల్లడించారు. బాలీవుడ్‌లో తాను విజయం సాధించానని, నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకున్నానని చెప్పారు. మండి ఎంపీగా గెలుపొందితే బాలీవుడ్‌కు వీడ్కోలు పలకాలనుకుంటున్నానన్నారు. ఒక ఉత్తమ ఎంపీగా ప్రజలకు తన వంతు కృషి చేస్తానని, అదే తనకు గొప్ప అవార్డుగా భావిస్తానని కంగనా బదులిచ్చారు. ఇదే సమయంలో సినీ ఇండస్ట్రీలో కొనసాగాలని కోరుతూ నిర్మాతల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. 'మీరొక ప్రతిభావంతమైన నటి. సినిమాలకు దూరంగా ఉండొద్దు' అని చాలామంది నిర్మాతలు, ప్రముఖ నటులు కోరుతున్నట్లు చెప్పారు. అంతకుముందు మరో వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా భిన్నంగా స్పందించారు. 'ఎన్నికల ముందు నేను సంతకం చేసిన కొన్ని సినిమాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంతో వెంటనే బాలీవుడ్‌ను విడిచిపెట్టలేను' అని పేర్కొన్నారు.

నాణ్యతలేని పతంజలి 'సోన్ పాపిడి'

కంపెనీ మేనేజర్ సహా ముగ్గురికి ఆరు నెలల శిక్ష

న్యూదిల్లీ: పతంజలి ఉత్పత్తుల నాణ్యతపై దేశంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కోవిడ్ మందులపై తప్పుడు ప్రచారం చేసినందుకు ఈ కంపెనీ వ్యవస్థాపకులకు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. బహిరంగంగా క్షమాపణ చెప్పింది. తాజాగా పతంజలి 'సోన్ పాపిడి' నాణ్యత చర్చనీయాంశమైంది. ఈ ఉత్పత్తి నాణ్యత తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్‌తో సహా ముగ్గురు అరెస్టు అయ్యారు. వీరికి జరిమానా విధించడమే కాకుండా ఆరు నెలల శిక్ష పడింది. పిథోరాగఢ్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌లోగల టెస్టింట్ ల్యాబ్‌లో పతంజలి సోన్‌పాపిడీకి నిర్వహించిన నాణ్యతా పరీక్షల్లో అది నాసిరకంగా ఉన్నట్లు వెల్లడైంది. 2019లో పిథోరాగఢ్, బెరినాగ్‌లోని మెయిన్ మార్కెట్‌లోని లీలాధర్ పాథక్ దుకాణంలోని పతంజలి నవరత్న ఇలైచీ సోన్ పాపిడీ గురించి ఫుడ్ సేఫ్టీ ఇనస్పెక్టర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో ఈ మిఠాయి నమూనాల సేకరణ జరిగింది. అనంతరం హరిద్వార్‌లోని పతంజలి ఆయుర్వేద లిమిటెడ్, రామ్‌నగర్‌లోని కనాహాజీ డిస్ట్రిబ్యూటర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. 2020 డిసెంబరులో రుద్రాపూర్‌లోని టెస్టింట్ ల్యాబ్ ఓ నోటీసును రాష్ట్ర ఆహార భద్రతా శాఖకు పంపింది. అందులో ఈ మిఠాయి నాణ్యతలేనిదిగా పేర్కొంది. ఫలితంగా వ్యాపారవేత్త లీలాధర్ పాథక్, డిస్ట్రిబ్యూటర్ అజయ్ జోషి, పతంజలి అసిస్టెంట్ మేనేజర్ అభిషేక్ కుమార్‌పై కేసులు నమోదయ్యాయి.

విగతజీవులుగా...

ముగ్గురు మహిళల అనుమానాస్పద మృతి

తెలంగాణ వాసులుగా గుర్తింపు?

మృతికి కారకులను ఉపేక్షించం: డీఐజీ

విశాలాంధ్ర-కల్లూరు: ముగ్గురు మహిళలు విగతజీవులుగా పడి ఉండడం స్థానికుల్లో చాలా అనుమానాలను రేకిస్తోంది. దర్గా సమీపంలో ఓ మహిళ, పక్కనే ఉన్న చెరువులో ఇద్దరు మహిళల మృతదేహాలు పడిఉండడం ఉలికిపాటుకు గురిచేసింది. పోలీసులు వీరిని తెలంగాణ వాసులుగా గుర్తించడంతో అసలు ఏం జరిగి ఉంటుందోనన్న ఆందోళన ఆయా గ్రామాల ప్రజల్లో నెలకొంది. వివరాలివి. కర్నూలు జిల్లా కల్లూరు రూరల్ మండలం గార్గేపురం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ముగ్గురు మహిళలు అనుమాదాస్పద స్థితిలో మృతి చెందారు. తొలుత గార్గేపురం దర్గా దగ్గర ఓ మహిళ శవాన్ని స్థానికులు గుర్తించారు. పక్కనే ఉన్న చెరువులో మరో ఇద్దరి మహిళల శవాలు నీటిలో తేలియాడుతూ కనిపించడంతో సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. చెరువులో తేలియాడుతున్న ఇద్దరు మహిళల మృతదేహాలను గజఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు. దర్గా సమీపంలో మహిళా మృతదేహాన్ని పోలీస్ డాగ్, క్లూస్ టీంతో పరిశీలించి అక్కడ దొరికిన ఆనవాళ్లను భద్రపరిచి పోస్టుమార్టం నిమిత్తం ముగ్గురి మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏం జరిగిందోనన్న ఆదుర్దాతో ప్రయాణికులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకోవడంతో రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఘటన స్థలాన్ని డీఐజీ విజయమోహన్ సందర్శించారు. వివరాలు సేకరించారు. మృతులు ముగ్గురూ తెలంగాణ వాసులుగా గుర్తించామని, వీరి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని డీఐజీ చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారమే కేసు నమోదు చేస్తామని చెప్పారు. మహిళల మృతికి కారకులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే పోలీసు బృందం రంగంలోకి దిగి విచారణ జరుపుతోందని చెప్పారు. డీఐజీతో పాటు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ కారణం విజయ శేఖర్, సీఐ శ్రీధర్ , రెవెన్యూ అధికారులు మహానంది, మాధవకృష్ణ ఉన్నారు.

హాస్టల్‌లో విద్యార్థి మృతి

ఇండోర్: పబ్లిక్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతదేహానికి సమీపంలో రక్తపు మరకలు కనిపించాయి. ఆ విద్యార్థి చీర కట్టుకొని, మేకప్ వేసుకొని, చేతులకు గాజులు వేసుకొని కనిపించాడు. కళ్లకు గంతలు కూడా కట్టుకొని ఉన్నాడు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌లో పునీత్ దూబే అనే విద్యార్థి రంజిత్ సింగ్ కాలేజీలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. పునీత్ స్వస్థలం ఉదయ్‌పుర. మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల కోసం రెండేళ్ల నుంచి ఇండోర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ శుక్రవారం రాత్రి పునీత్ చనిపోయాడు. హాస్టల్ గదిలో తలుపు పెట్టుకొని ఉన్నాడు. తర్వాత చుట్టుపక్కల వారికి వాసన రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతిరోజు రాత్రి పునీత్ తన తల్లితో ఫోన్‌లో మాట్లాడతాడు. శుక్రవారం ఫోన్ స్విచాఫ్ ఉండటంతో ఆ మరునాడు ఇండోర్‌లో ఉన్న స్నేహితులు, బంధువులకు తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. గది వద్దకు రాగా లోపల గడియ పెట్టి ఉంది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపు తీసి చూడగా పునీత్ విగతజీవిగా కనిపించాడు. చీర కట్టుకొని ఉండటంతో ఆత్మహత్య, హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారులు వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.